జిల్లా పోలీస్ బాస్‌గా నేడు అజిత బాధ్యతల స్వీకరణ

నెల్లూరు (క్రైం), సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పోలీసు బాస్‌గా అజిత వేజెండ్ల సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆదివారం సాయంత్రమే పోలీస్ అతిథి గృహానికి చేరుకున్న ఆమెకు జిల్లా పోలీస్ అధికారులు స్వాగతం పలికారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఉదయం ఎస్పీగా బాధ్యతలు స్వీకరిస్తారు. జిల్లాలో వరుసగా జరుగుతున్న సంఘటనలు, ప్రతిపక్ష నాయకులపై కేసులు, రౌడీషీటర్ల వరుస అరెస్టులతో శాంతిభద్రతల పరిరక్షణ కత్తిమీద సవాళ్లుగా మారనుంది.



కండలేరు డ్యాం వద్ద 11 కి.మీ పొడవు, 49 మీటర్ల ఎత్తు వంకర్లు తిప్పుతూ నిర్మించిన ఈ మట్టికట్ట ఇంజనీర్ల మేథస్సుకు నిదర్శనం. ఆసియా ఖండంలోనే ఇలాంటి కట్టడం ఇప్పటికీ లేదు.

కండలేరు..
ఓ వండర్ డ్యాం!

అద్భుత నిర్మాణాలు దేశ ప్రగతికి ప్రతీకలు. ఇంజనీర్ల ప్రతిభకు తార్కాణాలు. మహనీయుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య స్ఫూర్తితో జిల్లాలో నిర్మించిన కండలేరు జలాశయం ఇంజనీర్ల మేథోసంపత్తికి దర్పణంగా నిలుస్తోంది. ఎంతోమంది ఇంజనీర్లు, శ్రామికులు రేయింబవళ్లు కష్టపడి భావితరాలకు ఈ ప్రాజెక్టును అందించారు. లక్షల ఎకరాలకు సాగునీటితోపాటు నెల్లూరు, చిత్తూరు, చెన్నైవాసుల దాహం తీరుస్తున్న కండలేరు జలాశయ నిర్మాణం ఓ అద్భుతం. అలాంటి ప్రాజెక్టుతోపాటు జిల్లా జలప్రసాదినిగా పేరు గడించిన సోమశిల జలాశాయాన్నీ ఇంజనీర్లు అద్భుతంగా తీర్చిదిద్దారు. నేడు ఇంజనీర్స్ డే సందర్భంగా ప్రత్యేక కథనం..

- సమగ్ర కథనం

8లో..

ఇసుక డ్రెడ్జింగ్‌కు

బ్రేక్!

25 రోజులుగా ఆగిన వెలికితీత ప్రక్రియ

ముగిసిన సీటీవో గడువు.. ఆ తర్వాత రాని అనుమతులు

జిల్లాలో ఇసుక డ్రెడ్జింగ్ ప్రక్రియకు బ్రేకులు పడ్డాయి. గడిచిన 25 రోజులుగా డీసిల్టేషన్ పాయింట్ల వద్ద ఇసుకను వెలికి తీయడం ఆపేశారు. నదిలో డ్రెడ్జింగ్ చేసేందుకు పర్యావరణ శాఖ ఇచ్చిన కన్సెంట్ టు ఆపరేట్ (డ్రెడ్జింగ్‌కు అనుమతి) గడువు గత నెల 21వ తేదీతో ముగిసింది. దీంతో అప్పటి నుంచి కాంట్రాక్ట్ ఏజన్సీలు డీసిల్టేషన్ చేయడం లేదు. ఈ ప్రభావం ఇసుక నిల్వలపై పడుతోంది.

నెల్లూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం మాన్‌సూన్ సీజన్ కావడంతో నదుల్లో ఎక్కడా ఇసుక తవ్వకాలు జరిపేందుకు పర్యావరణ చట్టాలు అనుమతించవు. జూన్ నుంచి ఇసుక తవ్వకాలు ఆగిపోగా, కేవలం డీసిల్టేషన్‌కు మాత్రమే అనుమతి ఉండటంతో సంగం, నెల్లూరు బ్యారేజీల వద్ద డ్రెడ్జింగ్ చేస్తున్నారు. ఇప్పుడు అందుకు కూడా అనుమతుల గడువు ముగిసిపోవడంతో మొత్తంగా ఇసుక తవ్వకాలు నిలిచిపోయాయి.

జిల్లాలో మూడు ప్రాంతాల్లో డీసిల్టేషన్‌కు అనుమతి ఉంది. సంగం బ్యారేజీ ఎగువ భాగంలో సంగం, సూరాయపాలెం వద్ద రెండు డీసిల్టేషన్ పాయింట్లు ఉండగా, నెల్లూరు బ్యారేజీ ఎగువ భాగంలో పోతిరెడ్డిపాలెం వద్ద మరో పాయింట్ ఉంది. ఈ మూడు ప్రాంతాల్లో సరాసరి రోజుకు రెండు వేల టన్నుల వరకూ ఇసుకను వెలికి తీసుకొచ్చేవారు. వేసవి కాలంలో ఇసుక వినియోగం కూడా ఇదే పరిమాణంలో ఉండగా, ప్రస్తుతం అది క్రమేణా తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం రోజుకు వెయ్యి టన్నుల వరకూ ఇసుక వినియోగం జరుగుతున్నట్లు అంచనా. ఇలా డ్రెడ్జింగ్ ద్వారా తీసిన ఇసుకను స్టాక్ యార్డుల్లో నిల్వ చేస్తున్నారు. అక్కడ నుంచే ప్రస్తుతం ఇసుక విక్రయాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం సంగం యార్డులో సుమారు 70 వేల మెట్రిక్ టన్నులు, సూరాయపాలెంలో యార్డులో సుమారు 40 వేల మెట్రిక్ టన్నులు, పోతిరెడ్డిపాలెం యార్డులో సుమారు 8 వేల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలున్నాయి. గడిచిన మూడు వారాలుగా డీసిల్టేషన్ లేకపోవడంతో ఈ నిల్వల నుంచే విక్రయాలు జరుపుతున్నారు.

● రానున్నది వరదల కాలం

రానున్నది వర్షాకాలం కావడం, అందులోనూ సోమశిల నుంచి పెన్నాకు నీటిని విడుదల మొదలుపెట్టారు. ఈ క్రమంలో అక్టోబరు 15 తర్వాత మాన్‌సూన్ సీజన్ ముగిసినా నేరుగా వెళ్లి ఇసుక తవ్వకాలు జరపడం కొంత కష్టంగా మారుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా నిర్మాణ రంగం, పారిశ్రామిక రంగ అవసరాలకు తగ్గట్లు ఇసుక నిల్వ చేసుకోవాల్సిన అవసరముంది. డ్రెడ్జింగ్‌కు కన్సెంట్ టు ఆపరేట్ (సీవోటీ) అవసరమని ఇరిగేషన్ శాఖ అధికారులు కలెక్టర్‌కు నివేదించారు. ఆ వెంటనే కలెక్టర్ కూడా పర్యావరణ శాఖ రాష్ట్ర అధికారులకు లేఖ రాశారు. కానీ ఇంత వరకు అనుమతులు రాలేదు. కాగా ఈ అంశంపై ఇరిగేషన్ ఎస్ఈ దేశానాయక్‌తో మాట్లాడగా సీటీవో ముగియడంతో డీసిల్టేషన్ ప్రక్రియ ఆగిపోయినట్లు చెప్పారు. సీటీవో గడువు పొడగించాలని పర్యావరణ శాఖకు కలెక్టర్ లేఖ రాసినట్లు ఆయన వివరించారు.



సంగం డీసిల్టేషన్ పాయింట్ వద్ద ఒడ్డున నిలిచి ఉన్న డ్రెడ్జింగ్ పడవ

అమ్మో.. ఏమిటా శబ్దం!

భారీ పేలుళ్లతో ఉలికిపడ్డ కావలి వాసులు

ఫైర్, పోలీసులకు సమాచారం

ఆయిల్ నిక్షేపాల కోసమేనని తేల్చడంతో ఊపిరి పీల్చుకున్న ప్రజలు

కావలి పట్టణం. ఆదివారం మధ్యాహ్నం సరిగ్గా 2.35-40 గంటల ప్రాంతం. ఉన్నట్టుండి భూమి కంపిస్తున్నట్టు భారీ శబ్దం. అంతే... ఏదో జరగబోతోందని గ్రహించిన ప్రజలు అంతా ఇళ్లల్లో నుంచి బయటకు పరుగులు తీశారు. వెంటనే పోలీసులకు, అగ్నిమాపక దళానికి సమాచారం అందజేశారు. వెంటనే ముసునూరుకు చేరుకున్న పోలీసులు అక్కడ జరుగుతున్న పనులు చూసి, ఏమీలేదంటూ చెప్పడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళితే..



భూమికి రంధ్రాలు వేస్తున్న ఓఎన్‌జీసీ సిబ్బంది

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'మిషన్ అన్వేషణ్' కార్యక్రమంలో భాగంగా ఓఎన్‌జీసీ (ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్) సంస్థ సిబ్బంది కావలిలోని ముసునూరు వద్ద పొలాల్లో ఆదివారం బోర్లతో డ్రిల్ వేసి బ్లాస్టింగ్ చేశారు. దీంతో మధ్యాహ్నం 2.40, 3.20, 4.00 గంటల ప్రాంతంలో 14 సార్లు భారీ శబ్దాలు రావడంతో భూకంపం వస్తుందన్న భయంతో ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు పరుగులు తీశారు. అధికారుల నుంచి ముందస్తు సమాచారం లేకపోవటంతో భూమిలో వింత శబ్దాలు వస్తున్నాయంటూ అగ్నిమాపక శాఖ అధికారులతోపాటు రూరల్ పోలీసు లకు సమాచారం ఇచ్చారు. దీంతో ఫైర్ ఆఫీసర్ శ్రీనాథ్‌రెడ్డి ఫైరింజన్, సిబ్బందితోను, రూరల్ సీఐ జి.రాజేశ్వరరావు, ఎస్ఐ తిరుమల రెడ్డి, పోలీస్ సిబ్బందితో ఆ ప్రాంతానికి చేరుకున్నారు. కావలి ప్రాంతంలో సుమారు 500 మంది ఓఎన్‌జీసీ సిబ్బంది డీజిల్, పెట్రోల్, గ్యాస్ నిక్షేపాల కోసం అన్వేషిస్తున్నట్లు ఆ సంస్థ సిబ్బంది ద్వారా సీఐ తెలుసుకున్నారు. బోర్ యంత్రాలతో డ్రిల్ వేసి ఆ రంధ్రాలలో డైనమిక్ పెట్టి పేల్చడంతో ఏర్పడే వైబ్రేషన్‌తో నిక్షేపాల అన్వేషణ డేటా స్వీకరిస్తున్నట్లు ఆ ప్రాంత వాసులకు తెలపటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

- కావలి రూరల్, (ఆంధ్రజ్యోతి)



30 రోజులు 31.99 లక్షల మంది

- 'స్త్రీ శక్తి'కి మహిళాలోకం జేజేలు
- రూ.14.29 కోట్ల ఖర్చు
- బస్సుల్లో 12 శాతం పెరిగిన ఓఆర్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) :సూర్ సిక్స్ అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన స్త్రీశక్తి పథకానికి మహిళాలోకం జేజేలు కొడుతోంది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకం ప్రారంభించి నేటితో నెల రోజులు పూర్తవుతుంది. ప్రధానంగా పల్లె ప్రాంతాల్లోని మహిళలు, రోజూ ప్రయాణించే ఉద్యోగినులు, చిరువ్యాపారులు, విద్యార్థినులు లబ్ధి పొందుతున్నారు పల్లెవెలుగు, అల్ట్రాపల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో గతంలో 68 శాతం ఓఆర్ వస్తుండగా ఉచిత ప్రయాణాలతో 80 శాతం ఓఆర్‌కు పెరిగింది. నెల రోజుల్లో 3,19,9612 మంది మహిళలు బస్సుల్లో ప్రయాణించగా, రూ.14,29,06,064 లబ్ధి చేకూరింది. ఈ ఖర్చు ఆర్టీసీకి రాష్ట్ర ప్రభుత్వం చెల్లించనుంది.

నెల రోజుల్లో ఉచిత బస్సు ప్రయాణాలు

డిపో	బస్సులు	ప్రయాణికులు	ఖర్చు (రూ.లలో)
ఆత్మకూరు	57	3,62,166	1,74,20,750
కందుకూరు	59	5,74,845	1,78,67,238
కావలి	81	6,16,983	2,59,85,470
నెల్లూరు-1	88	5,37,925	2,86,96,287
నెల్లూరు-2	76	5,70,640	2,09,63,900
రాపూరు	44	2,97,414	1,55,65,030
ఉదయగిరి	43	2,39,639	1,64,07,389
మొత్తం	448	3,19,9612	14,29,06,064

ఇటీవల కాలంలో పశువులకు వ్యాప్తి చెందుతున్న వ్యాధులతో పాడిరైతులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గాలికుంటు వ్యాధి కూడా ఒకటి. ఈ వ్యాధిని ప్రారంభంలో గుర్తించకపోతే పాల ఉత్పత్తి తగ్గిపోవడమే గాక పశువుల మరణాలు కూడా సంభవిస్తున్నాయి. దీని నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా వ్యాధి నిరోధక టీకాల పంపిణీ కార్యక్రమం చేపడుతోంది. ఇంటి వద్దకే పశువైద్యులు వచ్చి టీకాలు అందించేలా ప్రణాళికలు రూపొందించారు. 'గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయిద్దాం.. పశువుల ఆరోగ్యాన్ని కాపాడుకుందాం' అనే నినాదంతో సాగనున్న ఈ కార్యక్రమం జిల్లాలో సోమవారం నుంచి నెలరోజులపాటు జరగుతుంది.

- నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి)

గాలికుంటు వ్యాధి..

టీకాలతోనే నివారణ

- ఆరంభంలోనే గుర్తించకుంటే నష్టమే!
- నేటినుంచి నెలరోజులపాటు టీకాల పంపిణీ
- జిల్లాకు 5,18,000 డోస్‌ల కేటాయింపు

పశువుల్లో సోకే గాలికుంటు వ్యాధి నివారణకు నెలరోజులపాటు ఉచితంగా టీకాలు వేయనున్నారు. జిల్లాలో దాదాపుగా 6,46,088 నల్ల పశువులు, 57774 తెల్ల పశువులు ఉన్నట్లు వ్యవసాయశాఖ లెక్కలు చెబుతున్నాయి. వీటిలో 4నెలలు దాటిన ప్రతి పశువుకు గాలికుంటు వ్యాధి నివారణా టీకాలు వేయించాలనేది ప్రభుత్వ లక్ష్యం. దీనికి సంబంధించి జిల్లాకు దాదాపుగా 5,18,000 టీకాల డోసులు జిల్లాకు రావడం, వీటిని నెల్లూరు, కందుకూరు, కావలి డివిజన్లకు కేటాయించడం జరిగిపోయింది. ఒక్కో రైతు సేవా కేంద్రం పరిధిలో ఎన్ని పశువులు ఉన్నాయనే వివరాల మేరకు పశుసంవర్థక శాఖ ఉన్నతాధికారులు ఇద్దరు, ముగ్గురు సభ్యులుగా బృందాలను ఏర్పాటు చేసి పశువులకు ఈ గాలికుంటువ్యాధి నివారణటీకాల పంపిణీ కార్యక్రమం విజయవంతం చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నారు.





● వ్యాధి లక్షణాలు..

కలుషితమైన గాలి, నీరు, మేత ద్వారా ఈ వ్యాధి సోకుతుంది. ఈ వ్యాధి సోకిన పశువుల నోటి నుంచి తీగల మాదిరి చొంగ కారుతూ ఉంటుంది. తీవ్రమైన జ్వరం ఉంటుంది. నోరు, కాలిగిట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయి. కొద్దిపాటి ఎండకు కూడా రొప్పడం చేస్తాయి. చూడి పశువులు ఈసుకుపోతాయి. వ్యాధి సోకిన పశువు ద్వారా ఇతర పశువులకు సంక్రమించే అవకాశం ఎక్కువ. పాలుతాగే దూడల్లో మరణాలు సంభవిస్తాయి. అంతేగాక పాల దిగుబడిలో దాదాపు సగం తగ్గిపోతుంది. నిర్లక్ష్యం చేస్తే పశువులు చనిపోతాయి. చికిత్స చేయించి, కోలుకున్న పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గిపోతుంది. పైగా మేత మేయడంలో మాత్రం ఎ లాంటి మార్పు ఉండదు. దీంతో రైతు ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఎక్కువగా ఉంది. ఈ వ్యాధి నివారణకు జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద నిరోధక టీకాల కార్యక్రమం చేపడుతోంది. ముందస్తు జాగ్రత్తగా ఈ టీకాలు వే యించుకోవడం వల్ల పాడిపశువుల్లో వ్యాధిని నిరోధించడం జరుగుతుంది. పాల ఉత్పత్తి తగ్గకుండా క్రమబద్ధీకరించవచ్చు. అదేవిధంగా మగ పశువుల్లో పని సామర్థ్యం తగ్గకుండా కాపాడుకోవచ్చు.

వ్యాధిని నివారించడమే లక్ష్యం



దేశవ్యాప్తంగా గాలికుంటువ్యాధిని పూర్తిగా నివారించడమే ఈ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ఈ వ్యాధితో ఒక్క దూడ, పశువు చనిపోకుండా ఉండేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా ఉచితంగా టీకాలను పంపిణీ చేస్తున్నాయి. పశుసంవర్ధక శాఖ అధికారులు, సిబ్బంది పాడి రైతు ఇంటి వద్దకే వచ్చి ఉచితంగా వ్యాక్సిన్ ఇస్తారు. పాడిరైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- డాక్టర్ రమేష్‌నాయక్, జేడీ, పశుసంవర్ధక శాఖ

డీఎస్సీ అభ్యర్థుల్లో ఉత్కంఠ

తుది ఎంపిక జాబితా నేడు విడుదల ● 19న నియామక పత్రాల పంపిణీ

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీకి సంబంధించి పరీక్షలు పూర్తి చేసి ప్రాథమిక, తుది కీల విడుదల, మెరిట్ జాబితాల పరిశీలన కూడా పూర్తి కావడంతో సోమవారం తుది ఎంపిక జాబితాలను డీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌లో విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అభ్యర్థుల్లో ఆనందం, ఉత్సాహంతోపాటు ఉత్కంఠ కూడా నెలకొంది. జిల్లావ్యాప్తంగా అన్ని మేనేజ్‌మెంట్లలో 673 పోస్టులు భర్తీకి సంబంధించిన నియామక ప్రక్రియలో ఇప్పటికే సర్టిఫికేట్‌ల వెరిఫికేషన్‌ను వివిధ దశల్లో పూర్తి చేశారు. జూన్ 2 నుంచి నెలరోజులపాటు కంప్యూటర్ ఆధారిత పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలకు 31,221 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకుని హాజరయ్యారు. మెరిట్ జాబితా విడుదల, ధ్రువపత్రాల పరిశీలన కూడా పూర్తవడంతో ఇక తుది ఎంపిక జాబితాను విడుదల చేసి ఎంపికైనవారికి నియామక పత్రాలను అందించడం కోసం విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

● నియామక ఉత్తర్వులకు సన్నాహాలు

విజయవాడలో 19న సీఎం చంద్రబాబు నాయుడు చేతులమీదుగా అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయనున్నారు. ఈ కార్యక్రమానికి అభ్యర్థితోపాటు మరొకరు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులకు ఆదేశాలు అందాయి. అభ్యర్థులంతా 18న సాయంత్రం నుంచి 19వ తేదీ వరకు బస చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎంపికైన అభ్యర్థులకు జిల్లాలో పదిరోజులపాటు శిక్షణ అందించి పాఠశాలలను కేటాయించనున్నారు.



నవోదయ పాఠశాల ప్రిన్సిపాల్‌ను విచారిస్తున్న ఎస్ఐ

విద్యార్థిపై దాడిచేసిన


ప్రిన్సిపాల్ సస్పెన్షన్

8

పక్కా ప్రణాళికతో జలాశయాల్లో నీటి నిల్వ

● రానున్న రోజుల్లో సాగుకు ఇబ్బందులుండవ్! ● సోమశిలలో రాష్ట్ర మంత్రి ఆనం ● డ్యాం నుంచి నీటి విడుదల

అనంతసాగరం సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సోమశిల, కండలేరు జలాశయాల్లో పక్కాప్రణాళికతో నీటినిల్వ చేశామని, రాబోవు రోజుల్లో నీటి ఇబ్బందులు లేకుండా దృష్టి సారించినట్లు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఎగువ నుంచి వస్తున్న వరదతో సోమశిలలో నీటినిల్వ 74 టీఎంసీలకు చేరుకుంది. దీంతో ఆదివారం డ్యాంలోని 5, 6 గేట్లు ఎత్తి 10 వేల క్యూసెక్కుల నీటిని దిగువ పెన్నా నదికి విడుదల చేశారు. ముందుగా కంట్రోల్ రూం వద్దకు చేరుకున్న మంత్రి ఆనం స్విచ్చాన్ చేసి గేట్లు ఎత్తారు. జలహారతి ఇచ్చి నీరు విడుదల చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆనం మాట్లాడుతూ శ్రీశైలంకు ఎగువ నుంచి వచ్చిన వరదతో పోతిరెడ్డిపాడు నుంచి రాయలసీమ జిల్లాలకు నీటి లభ్యత చేకూరిందని, అందులో భాగంగా వచ్చే నీటిని ప్రణాళికంగా సోమశిల, కండలేరు ప్రాజెక్టులో నిల్వ చేసుకోగలిగామని చెప్పారు. ప్రాజెక్టు ప్రాధాన్యత క్రమంలో 74 టీఎంసీలు నిలుపుదల చేసి ఇక వచ్చిన జలాలను వచ్చినట్లు దిగువకు విడుదల చేసేలా అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 5.60 లక్షల ఎకరాల్లో రెండవ పంటకు నీరు ఇచ్చామని, ఉన్న జలాలతో రాబోవు రోజుల్లో నీటి ఇబ్బందులు ఉండవన్నారు. వచ్చే నెల నుంచి పెన్నాక్యాచ్ మెంట్ ఏరియాలో వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని ఆ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ఇంజనీర్లను అప్రమత్తం చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఛైర్మన్ వేలూరు కేశవచౌదరి, ఎస్ఈ వెంకటరమణారెడ్డి, ఆర్డీవో పావని, మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సాగరం చెరువు నీటి సంఘం అధ్యక్షుడు రాపూరు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, నీటి విడుదలను సాయంత్రానికి 10,030 క్యూసెక్కులకు పెంచారు.



సోమశిల నుంచి దిగువకు పరవళ్లు తొక్కుతున్న జలాలు

● సోమశిలకు పెరిగిన వరద

సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద పెరిగింది. ఆదివారం 32,971 క్యూసెక్కులు కొనసాగగా, డ్యాంలో 74.800 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 2,650, ఉత్తర కాలువకు 400, కండలేరుకు 10,350 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.



గంగమ్మకు పూజలు చేస్తున్న మంత్రి ఆనం

కరేడు రైతులతో కలిసి

ఆమరణ దీక్ష చేస్తా!

● బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్

ఉలవపాడు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఇండోసోల్ సోలార్ కంపెనీకి విలువైన భూములను దోచిపెట్టే ఆలోచన రాష్ట్ర ప్రభుత్వం మార్చుకోపోతే కరేడు రైతులతో కలిసి ఆమరణ నిరాహార దీక్ష చేపడతానని భారత చైతన్య యువజన (బీసీవై) పార్టీ అధ్యక్షుడు బోడె రమాచంద్ర యాదవ్ స్పష్టం చేశారు. ఉలవపాడు మండలం కరేడులో రైతులు చేపట్టిన భూసేకరణ పోరాటానికి మద్దతుగా ఆదివారం ఆయన కరేడులో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ తన ప్రాణాలైనా ఇచ్చి కరేడు రైతులకు చెందిన ఒక్క సెంటు భూమికూడా ఇండోసోల్ కంపెనీకి చెందకుండా చేసే బాధ్యత తాను తీసుకుంటానని మరోసారి భరోసా కల్పించేలా మాట్లాడారు. చంద్రబాబు ప్రభుత్వం కరేడు రైతుల మనోభావాలను గౌరవించి ఇచ్చిన జీవోని వెనక్కు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరించి భూసేకరణకే మొగ్గు చూపితే ఉద్యమం మరోరూపం దాల్చి యావత్తు రైతాంగం ఆమరణ దీక్షకు పూనుకుంటే తానూ దీక్ష చేపడతానన్నారు. అభివృద్ధి పేరుతో లక్షల ఎకరాలు భూములు తీసుకుంటున్న ప్రభుత్వం ఒక్కరికైనా యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించిన దాఖలాలు లేవని, రేపటి రోజున కరేడు రైతుల పరిస్థితి అదేగతి పడుతుందని అన్నారు.



కరేడు గ్రామసభలో మాట్లాడుతున్న రామచంద్ర యాదవ్

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	150
స్కిన్ చికెన్	264
స్కిన్‌లెస్	290

కోడిగుడ్ల ధర (100): 550

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.10496
వెండి కిలో ధర	రూ. 132300
వెండి ఒక గ్రాము	రూ.135.30

ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వైద్యపరీక్షలు

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆదివారం వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాకర్స్‌కు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ అంకిరెడ్డి, డాక్టర్ శ్రీధర్ వాకర్స్‌కు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి, ప్రధాన కార్యదర్శి పొన్నం రవిచంద్ర, వాకర్స్ మాజీ గవర్నర్ రాఘవేంద్రశెట్టి, నేతలు డీవీ.సుబ్బరాజు, స్వర్ణ రమేష్‌బాబు, గోపాల్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి


ఉద్యోగుల సంఘం కమిటీతో రాష్ట్ర, జిల్లా నేతలు

నెల్లూరు (వైద్యం) సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ల(యూపీహెచ్‌సీ) ఉద్యోగ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింహాచలం డిమాండ్ చేశారు. ఆదివారం ఆ సంఘం సమావేశం సీపీఎం జిల్లా కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఉద్యోగులు అధిక పనిభారంతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నా వేతనాల్లో తీవ్ర వ్యత్యాసం వల్ల ఉద్యోగులు అన్యాయానికి గురవుతున్నారని పేర్కొన్నారు. తక్షణమే వీరికి హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, వార్షిక ఇంక్రిమెంట్‌లు, ఉద్యోగ విరమణ సౌకర్యాలు కల్పించాలన్నారు. అనంతరం జిల్లా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా సాయితేజ, రూపేంద్ర ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, అజయ్‌కుమార్, 104 ఉద్యోగుల వర్కింగ్ అధ్యక్షులు వాసు, జయరాం, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మాసిస్ట్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లైవోవర్ నిర్మాణానికి దశలవారీ పోరాటం


ఆందోళన చేస్తున్న ఫ్లైవోవర్ బ్రిడ్జి ఆశయ సాధన కమిటీ సభ్యులు

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని చింతారెడ్డిపాళెం జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై ఫ్లైవోవర్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని ఆశయ సాధన కమిటీ కన్వీనర్ కాయంబు శ్రీనవాసులు కోరారు. ఆదివారం జాతీయ రహదారి వద్ద సాధన కమిటీ నేతలు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ ఫ్లైవోవర్ బ్రిడ్జిని నిర్మించాలంటూ 15 ఏళ్లుగా అనేక పోరాటాలు చేశామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఫ్లైవోవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. లేదంటే దశలవారీ పోరాటం నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశయ సాధన కమిటీ సభ్యులు రమణయ్య, శంకరయ్య, భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్ల నాయుడు, రామిరెడ్డి, నారాయణరెడ్డి, శివరాం తదితరులు పాల్గొన్నారు.

శ్రీగంగమ్మ తల్లికి నెల పొంగళ్లు

పొదలకూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): శ్రీగంగమ్మ తల్లి కొలుపు మహోత్సవం అనంతరం జరిగే నెల పొంగళ్ల కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. చైర్మన్, కమిటీ సభ్యులు, మండలంలోని యాదవ సోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వేదగిరీశుడికి తాళిబొట్టు బహూకరణ


ఈవో గోపికి తాళిబొట్టు అందచేస్తున్న దాతలు

నెల్లూరురూరల్,సెప్టెంబరు14,(ఆంధ్రజ్యోతి) : వేదగిరి లక్ష్మీనరసింహుడి నిత్యకల్యాణానికి చెన్నైకి చెందిన పోట్లూరి నరసింహులు బాలకృష్ణ పూజిత దంపతులు ఆదివారం రూ. 23 వేలు విలువ చేసే బంగారు తాళిబొట్టును ఈవో గోపికి అందచేశారు. వేదగిరి క్షేత్రానికి వచ్చిన వారు ఈవో, ఆలయ అర్చకుల సమక్షంలో తాళిబొట్టును ఆలయానికి అందచేశారు. స్వామి, అమ్మవార్ల కల్యాణంలో దీన్ని వినియోగిస్తామని ఈవో తెలిపారు.

నేత్రదానం

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : స్థానిక విద్యుత్ భవన్ వద్ద హత్యకు గురైన మైధిలి ప్రియ (23) నేత్రాలను ఆదివారం కుటుంబ సభ్యుల అనుమతితో ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి టెక్నీషియన్ సునీల్ సేకరించారు. వరుణ్‌కుమార్ సహకారంతో మృతురాలి తల్లి నడవటి శ్రీలక్ష్మి అంగీకారంతో నేత్రాలను సేకరించారు. అలాగే నానిని మహేష్ (35) జీజీహెచ్‌లో ఆదివారం మృతి చెందారు. మృతుడి భార్య సుష్మ అంగీకారంతో ఆయన నేత్రాలను సేకరించారు.

యూనివర్సల్ హెల్త్ పాలసీ అమలు అభినందనీయం

కోవూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు యూనివర్సల్ హెల్త్ పాలసీ అమలు చేయడం అభినందనీయమని టీడీపీ పార్లమెంటు కమిటీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర్లురెడ్డి అన్నారు. టీడీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రోగులకు ఆరోగ్యశ్రీ కంటే మెరుగైన సేవలు అందుతాయని ఆయన అన్నారు.

పదవులను బాధ్యతగా భావించాలి : మంత్రి

నెల్లూరు (వైద్యం) సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పదవులను బాధ్యతగా భావించి, న్యాయం చేయాలని పురపాలక శాఖామంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. ఆదివారం నగరంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఇటీవల నామినేటెడ్ పదవులు పొందిన వారికి మంత్రి శుభాకాంక్షలు తెలియచేశారు. అనంతరం మాట్లాడుతూ పదవులు పొందిన నేతలు ప్రజల కోసం బాధ్యతగా పనిచేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం ఇస్తామని తెలిపారు. అనంతరం పదవులు దక్కించుకున్న కప్పిర శ్రీనివాసులు, ఉచ్చి భువనేశ్వరప్రసాద్, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం మంత్రిని పుష్పగుచ్ఛం శాలువాతో సత్కరించారు. అనంతరం టీడీపీ నాయకుడు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి నామినేటెడ్ పదవులు పొందిన వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపీ సివిల్‌సప్లై డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ మేయర్ పీ. రూప్‌కుమార్, మధు, విజేతరెడ్డి పాల్గొన్నారు.


నామినేటెడ్ పదవులు పొందిన వారితో మంత్రి పొంగూరు నారాయణ, నుడా చైర్మన్ కోటంరెడ్డి తదితరులు

ఆలూరు శిరోమణిశర్మకి ఘన సన్మానం


సన్మానం అందుకుంటున్న ఆలూరు శిరోమణిశర్మ

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆదివారం గుంటూరులోని బ్రాడీపేట బ్రాహ్మణ సేవా సమితి భవన్‌లో ఉత్తమ బ్రాహ్మణ పండితులను ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో నెల్లూరుకి చెందిన ఆలూరు శిరోమణిశర్మ కూడా పురస్కారం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు జ్వాలాపురం శ్రీకాంత్, నాయకులు వెంకటసుబ్బారావు, పురుషోత్తమశర్మ, తదితరులు పాల్గొన్నారు. 50మందికి పైగా పురస్కారం అందుకున్నవారిలో ఉన్నారు.

ఇరుగాళమ్మకు పూర్ణకుంభం బహూకరణ


ఈవోకు వెండి పూర్ణకుంభం అందజేస్తున్న దాతలు

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు గ్రామదేవత ఇరుగాళమ్మకు ఆదివారం వెండి పూర్ణకుంభాన్ని జీ.విష్ణువర్ధన్ దంపతులు ఆలయ ఈవోకు అందచేశారు. దీని విలువ సుమారుగా రూ.72,750 ఉంటుంది. ఈ సందర్భంగా దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి ప్రసాదాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో ఈవో వీగిరి కృష్ణ, ఉత్సవ కమిటీ చైర్మన్ ఒట్టూరు సురేంద్రయాదవ్, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

చాముండేశ్వరి సేవలో వంశీకృష్ణారెడ్డి


వంశీకృష్ణారెడ్డిని సత్కరిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

ఇందుకూరుపేట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగపట్నంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన చాముండేశ్వరి దేవస్థానంలో ఆదివారం ఇటీవల కోవూరు ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన బెజవాడ వంశీకృష్ణారెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థానం పరిసరాలను పరిశీలించి, అవసరమైన అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు. స్థానిక నాయకులు వంశీకృష్ణారెడ్డికి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు గుండాల కృష్ణారెడ్డి, గంగపట్నం పంచాయతీ వైస్ చైర్మన్ కొండూరు వెంకటరమణారెడ్డి, బొద్దుకూరు సుధీర్, మారుబోయిన జనార్ధన్ గౌడ్, దుగ్గా శంకర్‌రెడ్డి, బండ్ల మల్లికార్జునగౌడ్, ఉదయ్‌కుమార్‌గౌడ్, జనసేన నాయకులు మాధవ్, ఆలయ కార్యనిర్వహణాధికారి తాతా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేపు వెంకటాచలం మండల మీట్

వెంకటాచలం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వెంకటాచలం మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈనెల 16వ తేదీ మంగళవారం ఉదయం 11 గంటలకు సాధారణ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కల్పన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖలపై సమీక్ష నిర్వహిస్తామని, సభ్యులతో పాటు అధికారులందరూ హాజరు కావాలన్నారు.

రాపూరమ్మకు పొంగళ్లు


అలంకరణలో రాపూరమ్మ

రాపూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాపూరు పట్టణంలో వెలసిన గ్రామదేవత రాపూరమ్మకు ఆదివారం పొంగళ్లు నిర్వహించారు. జాతర అయిన నెలరోజులకు గ్రామస్తులు నెల పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ. మేళతాళాలు, మంగళవాద్యాలతో గ్రామస్తులు ఊరేగింపుగా అమ్మవారి సన్నిధికి చేరుకున్నారు. పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించారు. పూలమాలలతో అలంకరించిన అమ్మవారిని భక్తులు దర్శించు కున్నారు.

వైభవంగా గణేశ్ నిమజ్జనం


నిమజ్జనానికి తరలివెళుతున్న గణేశుడు

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జొన్నవాడలో కామాక్షితాయి ఆలయం వెనుక వీధిలో యువత ఏర్పాటు చేసిన గణేశ్ విగ్రహాన్ని వైభవంగా ఊరేగించి ఆదివారం రాత్రి నిమజ్జనం చేశారు. నిమజ్జనోత్సవాన్ని తిలకించేందుకు పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులకు కందికట్టు భవానమ్మ అన్న ప్రసాద వితరణ చేశారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న అపస్మా నేతలు

పొదలకూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంగం రోడ్డులోని కేసీఆర్ఎస్ కళ్యాణ మండపంలో ఆదివారం ఆంధ్ర ప్రదేశ్ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ (అపస్మా) ఆధ్వర్యంలో ప్రైవేటు పాఠశాలల ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానోత్సవ సభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సర్వేపల్లి, రాపూరు యూనిట్ అపస్మా పరిధిలో పనిచేస్తున్న పలు ప్రైవేటు పాఠశాలల నుంచి ఎంపికైన 56 మంది ఉపాధ్యాయులను సన్మానించి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ప్రదానం చేశారు. అపస్మా పరిధిలోని ప్రైవేటు పాఠశాలల్లో పని చేస్తూ 2025 డీఎస్సీలో ఉద్యోగం పొందిన 7 మంది ఉపాధ్యాయులను ప్రత్యేకంగా సన్మానించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షుడు తులసి విష్ణుప్రసాద్, ఉపాధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎన్ శ్రీధర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో పలు ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కసుమూరులో భక్తుల సందడి

వెంకటాచలం, సెప్టెంబరు 14 : మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కసుమూరు మస్తాన్ వలీ దర్గాలో ఆదివారం భక్తుల రద్దీ సందడి నెలకొంది. తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలతో పాటు మన రాష్ట్ర నలమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మస్తాన్ వలి దర్గాను సందర్శించారు. పలువురు భక్తులు షాఫాబావిలో పుణ్య స్నానాలు ఆచరించి మస్తాన్ స్వామి వారిని దర్శించుకున్నారు. కొందరు భక్తులు స్వామి వారికి తలనీలాలు సమర్పించగా మరికొందరు అన్నదాన కార్యక్రమాలు చేపట్టి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈసందర్భంగా మస్తాన్ స్వామి వారి దర్గాకు పూలు, విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. దీంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదురుకున్నారు.

ఇరువర్గాల ఘర్షణ

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల గొడవల నేపథ్యంలో ఇరువురు కుటుంబసభ్యులు నగరంలోని రామ్‌నగర్‌లోని శ్రీరామ్‌స్తూపం వద్ద ఆదివారం పరస్పరం దాడులు చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు, నరేష్, లావణ్య దంపతులు. వారిద్దరి మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో కుటుంబసభ్యులకు మధ్యస్థాలు జరిపి సర్దుబాటు చేశారు. ఈ క్రమంలో ఆదివారం లావణ్య రామ్‌నగర్‌లోని శ్రీరామ్ స్తూపం వెనుక వైపు నివాసం ఉంటున్న పెద్దమ్మ కామాక్షి నివాసానికి వెళ్లింది. ఆ సమయంలోనే భర్త నరేష్ కుటుంబసభ్యులు అక్కడకు చేరుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య గొడవ ప్రారంభమైంది. గొడవ పెద్దదై ఘర్షణగా మారింది. దీంట శ్రీరామ్‌స్తూపం వద్ద కర్రలు, రాడ్డులతో పరస్పరం దాడులు చేసుకున్నారు. అనంతరం ఇరువర్గాల వారు దర్గామిట్ట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు విచారిస్తున్నారు.

గురుకులంలో వైద్యశిబిరం

ఆత్మకూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని బాలికల గురుకుల పాఠశాలలో జ్వరాలతో పలువురు విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఉన్నతాధి కారుల ఆదేశాల మేరకు గురుకులంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఆదివారం మర్రిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గోపీనాథ్ వైద్యపరీక్షలు నిర్వహించారు. జ్వరాల తీవ్రత తగ్గిందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు తెలిపారు.

సోమశిల.. 'సాంకేతిక' మకుటం!

- అద్భుత నిర్మాణం.. చెన్నై దాహం తీర్చే జలనిధి!
- రెండు కొండలను తొలిచి నిర్మించిన కట్టడం



అనంతసాగరం సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర కీలకమైనది. దశాబ్దాల క్రితం నిర్మించిన పలు జలాశయాలు, వంతెనలు, మార్గాలు.. వారి మేధోశక్తికి అద్దం పడతాయి. ప్రముఖ ఇంజనీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి (ఇంజనీర్స్ డే) సందర్భంగా సోమశిల జలాశయ అద్భుత నిర్మాణం పై ప్రత్యేక కథనం.

సోమశిల జలాశయం అప్పటి ఇంజనీర్ల ప్రతిభకు దర్పణం పడుతోం ది. పెన్నానది నుంచి జలాలు వృథా గా సముద్రంలో కలుస్తుండగా, వాటి ని ఒడిసిపట్టి రైతులకు మేలు చేకూ ర్చేందుకు ఈ ప్రాజెక్టును నిర్మించా రు. దీంతో సాగు, తాగునీటి అవసరా లు తీరి నేడు ప్రజలు సుభిక్షంగా జీవనం సాగిస్తున్నారు. సోమశిల ప్రాజెక్టుకు 1975లో శంకుస్థాపన చేశారు. 10 ఏళ్లలో ఒక దశ పను లు పూర్తయ్యాయి. రెండు కొండల మధ్య ఈ ప్రాజెక్టు నిర్మించారు. కొండల అంచులు అడ్డంకిగా ఉండే వాటిని తొలగించే ప్రక్రియలో ఇంజనీర్లు, శ్రామికులు పడ్డ కష్టాలను నేటికీ స్థానికులు చర్చించుకుంటుండడం విశేషం. ఈ ప్రాజెక్టు తొలుత 16 టీఎంసీల నీటిని నిల్వ చేసేలా డిజైన్ చేశారు. ఆ తర్వాత 32 టీఎంసీలకు.. నేడు అన్నీ అడ్డంకు లు అధిగమించి 78 టీఎంసీల నీరు నిల్వ చేసుకునే అవకాశం ఉంది. జిల్లా వ్యాప్తంగా డెల్టా, నాన్‌డెల్టాకు రెండు పంటలకు సాగు జలాలు అందించడంతో పాటు పొరుగు రాష్ట్ర మైన చైన్నెకి కూడా తాగు నీరు ఇస్తున్న జల నిధిగా మారింది. ఆనాటి ఇంజనీర్ల ప్రతిభతో నేటికీ ప్రాజెక్టు నిర్మాణం చెక్కుచెదరలేదు. నీటిలభ్యత పుష్కలం కావడంతో జిల్లాలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి.

నిర్మాణంలో కీలకం

ప్రాజెక్టు నిర్మాణంలో ఎర్త్‌డ్యాం, డౌన్‌స్టీం, క్రస్ట్‌గేట్ల అమరిక, ప్రొటెక్షన్‌వాల్స్, స్పిల్‌వే, గ్యాలరీ నిర్మాణాలు అద్భుతంగా డిజైనింగ్ చేసి నిర్మించారు. ఇవి నాటి ఇంజనీర్ల సాంకేతిక ప్రతిభకు అద్దం పడుతున్నాయి.



రాపూరు : బహుళార్థసాధక ప్రాజెక్టుగా ఖ్యాతి గడించిన కండలేరు జలాశయం మానవ శ్రమకు సంకేతం. ఈ ప్రాజెక్టు నెల్లూరు, చిత్తూరు జిల్లాలతో పాటు తమిళనాడులోని చెన్నై వాసుల జలప్రసాదినిగా నిలుస్తోంది. సాంకేతిక పరిజ్ఞానం అంతంతగానే ఉన్న రోజుల్లో ఆనాటి సివిల్ ఇంజనీరింగ్ అద్భుతాలతో ఈ డ్యాంను నిర్మించారు. వేలాదిమంది కూలీలు, రకరకాల యంత్రాలతో, ఇంజనీరింగ్ నిపుణుల పర్యవేక్షణలో స్థానిక సాంకేతిక నిపుణులు, అధికారులు, సిబ్బంది రేయింబవళ్లు శ్రమించి ఈ అద్భుత నిర్మాణాన్ని పూర్తి చేశారు. రాపూరు మండలం చెల్లటూరు గ్రామం వద్ద పెంచలకోన నుంచి వచ్చే కండలేరు వాగుపై నిర్మించిన ఈ డ్యాం సామర్థ్యం 68 టీఎంసీలు. వండర్ డ్యాంగా రికార్డులకెక్కిన ఈ కండలేరు ఆసియా ఖండంలోనే ఎక్కడా లేని విధంగా 11. కిమీ పొడవు, 49 మీటర్ల ఎత్తుతో నీటి అలలను తట్టుకునేలా వంకర్లు తిరిగే విధంగా మట్టికట్టను నిర్మించారు. ఇందుకోసం 161 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని వినియోగించారు. జిల్లాకు చెందిన కూలీలతోపాటు రాష్ట్ర నలుమూలలకు చెందిన శ్రామికులు పనుల్లో భాగస్వాములయ్యారు. అప్పటి ప్రభుత్వ ఓఎస్‌డీ, తెలుగు గంగ రూపకర్త రామకృష్ణయ్య సారథ్యంలోనే డ్యాం నిర్మాణ పనులు ప్రారంభించారు. తొలి ఎస్‌ఈగా కృష్ణమూర్తి, ఈఈగా వెంకట నరసయ్య పనిచేశారు నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో సుమారు మూడు లక్షల ఎకరాలకు సాగునీరు, లక్షలాది మంది ప్రజలకు తాగునీరు అందిస్తోంది. పొరుగు రాష్ట్రమైన తమిళనాడులోని చెన్నై నగరవాసులకు ఏడాదికి 15 టీఎంసీల నీటిని అందిస్తోంది. అంతేకాక హెడ్‌రెగ్యులేటర్ వద్ద 9 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం ఉన్నా తాజాగా 6 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు.



స్కూల్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు, తల్లిదండ్రులు

విద్యార్థిపై దాడిచేసిన ప్రిన్సిపాల్ సస్పెన్షన్

మర్రిపాడు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మర్రిపాడు మండలంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో శనివారం రాత్రి విద్యార్థిపై విచక్షణారహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పేతన స్వామిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. బాలుడి మీద దాడి ఘటనపై ఆంధ్రజ్యోతి ప్రచురించిన వార్తకు స్పందిస్తూ హైదరాబాద్ నవోదయ విద్యాలయ సమితి ఆదివారం సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, విద్యార్థిపై జరిగిన దాడి మీద బాధిత తల్లిదండ్రులు మర్రిపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్‌ఐ శ్రీనివాస్‌రావు స్కూల్ వద్దకు వెళ్లి ప్రిన్సిపాల్‌ను విచారించారు. విద్యార్థి సంఘం నాయకులు పాఠశాల ముందు బయటాయించి ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. అంతలో సస్పెన్షన్ ఉత్తర్వులు రావటంతో నిరసనను విరమించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు మహంత్‌రెడ్డి, ఖాజా, జగన్ తదితరులు పాల్గొన్నారు. కాగా చేసిన తప్పునకు ప్రిన్సిపాల్ ముఖంలో పశ్చాత్తాపం కనిపించలేదని, బిడ్డను ఎందుకు కొట్టావంటే సీఎంకి చెప్పుకోమన్నారని విద్యార్థి తల్లి చెన్నమ్మ మీడియా ఎదుట కంటతడి పెట్టింది.

రిజిస్ట్రేషన్లకు కష్టాలు

ఓటీపీ, ఆటో మ్యూటేషన్

సాఫ్ట్‌వేర్‌లో సమస్యలు

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి) :ప్రభుత్వం ప్రజలకు సత్వర సేవలు అందించడానికి రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఓటీపీ విధానం తీసుకొచ్చింది. గతంలో ఒకసారి నమోదు చేస్తే ఓటీపీ వచ్చేది. సరిపోయేది. కానీ ప్రస్తుత విధానంలో డేటా ఎంట్రీ చేస్తే ఓటీపీ ప్రతిసారి అప్ లోడ్ చేయాల్సి వస్తోంది. అన్నీ సరిచేసుకుని దస్తావేజులను సబ్ రిజిస్ట్రార్‌కు దాఖలు చేస్తే సర్వర్ సమస్యతో దస్తావేజు చెక్ స్లిప్ రావటం లేదు. దీంతో రిజిస్ట్రేషన్ కోసం మళ్లీ ఫీజులు చెల్లించి స్లాట్ బుక్ చేయాల్సి పరిస్థితి నెలకొంది. మళ్లీ రిజిస్ట్రేషన్ వారందరీ ఓటీపీలు చెప్పాల్సి వస్తోంది. దీంతో దస్తావేజుల రిజిస్ట్రేషన్లు ఆగిపోతున్నాయి. కొందరి వద్ద అందరి ఓటీపీలు ఉండటంతో రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. అయితే కొందరు ఫోన్ నంబర్లను సక్రమంగా వినియోగించకుండా, కుటుంబ సభ్యుల్లో ఎవరో ఒకరి నంబర్లు ఇస్తున్నారు. ఇలాంటి వారి రిజిస్ట్రేషన్లు జరగడం లేదు.. దీంతో ఓటీపీ గురించి అవగాహన లేక, రిజిస్ట్రేషన్లు జరక్క ప్రజలు అవస్థలు పడుతున్నారు.

● ఆటోమ్యూటేషన్ కూడా సమస్యే

ఆటోమ్యూటేషన్ విధానం అమలులోకి రావటంతో డోర్ నంబరు, ఆస్తి అసెస్మెంట్ నంబరు వ్యవహారంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆటోమ్యూటేషన్ రిజిస్ట్రేషన్ కోసం పబ్లిక్ డేటాలో ఇంటి డోర్ నంబరు ఫీడ్ చేస్తే, అసెస్మెంట్ నంబరు కంప్యూటర్ డేటాలో కనిపించడం లేదు. అసెస్మెంట్ నంబరు ఫీడ్ చేస్తే, ఇంటి డోర్‌నంబరు కనిపించడం లేదు. దీంతో దస్తావేజుల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఇబ్బందలు తలెత్తడం వలన కంప్యూటర్ డేటాలో అసెస్మెంట్ నంబరు అడిగిన చోట జీరోలు వేసి దస్తావేజును ముందుకు పంపుతున్నారు. ఇలా



రిజిస్ట్రేషన్ అయిన దస్తావేజులకు సంబంధించి ఇంటి పన్నులు మారుతాయో లేదో అనే భయాందోళనల్లో రిజిస్ట్రేషన్ దారులు ఉన్నారు. అర్బన్‌మ్యూటేషన్‌ను ఎలా వినియో గించుకోవాలనే అంశంపై రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ప్రజలకు తెలియ చేయాలి. కానీ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో వివరాలు చెప్పే వారే కరువయ్యారు.

● నగదు డిమాండ్

ఆటో మ్యూటేషన్ విధానలో రిజిస్ట్రేషన్ కోసం ఇంటి పన్నుల రశీదుల్లో గల విస్తీర్ణాన్ని సరిచేసుకునేందుకు గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్తే అక్కడ కొందరు ఉద్యోగులు ఎక్కువ మొత్తం డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రిజిస్ట్రేషన్ వ్యవహారాన్ని ఎలాగైనా ముగించుకోవాలని ఆ సచివాలయాల్లో అడిగిన మొత్తాన్ని కొందరు సమర్పించి రిజిస్ట్రేషన్లు చేసుకొంటున్నట్లు సమాచారం. కాని దస్తావేజుల రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన సమాచారమంతా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తెలియచేయాలి. పబ్లిక్ డేటా ఎంట్రీ కూడా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జరగాలి. అందుకు తగిన సిబ్బంది అవసరం. కాని కొందరు సబ్ రిజిస్ట్రార్‌లు ఇవన్నీ తాము చేసే పనులు కావంటూ డాక్యుమెంటు రైటర్లే చూసుకోవాలని వారిపైకి వదిలేయటంతో సమస్య తలెత్తింది.

నేటి నుంచి దస్తావేజు లేఖర్ల సమ్మె



దస్తావేజుల రిజిస్ట్రేషన్‌కు ఓటీపీ, ఆటోమ్యూటేషన్‌లకు సంబంధించి రూపొందించిన సాఫ్ట్‌వేర్ లోపభూయిష్టంగా ఉంది. వీటిలోని లోపాలను సరిచేయాలి. సాఫ్ట్‌వేర్‌లో లోపాలను సరిచేసి, ఓటీపి విధానాన్ని రద్దు చేయాలని సోమవారం నుంచి సమ్మె చేస్తున్నాం. రైటర్లకు, ప్రజలకు కలిగే అసౌకర్యంతో సమ్మె చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రజలంతా సహకరించాలి.

- పట్నం దుర్గేష్‌బాబు, జిల్లా డాక్యుమెంటు రైటర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు

ఉద్యమ ధ్రువతార సురవరం : సీపీఐ



నెల్లూరు (వైద్యం) సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ జాతీయ మా జీ కార్యదర్శి స్వర్గీయ సురవరం సుధాకర్ రెడ్డి ఉద్యమ ధ్రువతార అని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జీ. ఈశ్వరయ్య అన్నారు. ఆదివారం సీపీఐ జిల్లా కార్యాలయం లో పార్టీ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి అధ్యక్షతన సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడు తూ భూస్వామ్య కుటుంబంలో జ న్మించిన సురవరం నమ్మిన సిద్ధాం తం కోసం విద్యార్థి దశ నుంచే ఉద్యమబాట పట్టారన్నారు. కమ్యూనిస్టు పార్టీ అగ్రనేతగా ఎదిగి ఎన్నో యువజన, విద్యార్థి సంఘాలను తయారు చేశారన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో ఆయన పాత్ర ఎంతో ఉందన్నా రు. టిడ్కో చైర్మన్ వే ములపాటి అజయ్‌కుమార్ మాట్లాడుతూ తన తండ్రి అనంతరామయ్య, సుధాకర్‌రెడ్డి కలిసి ఎన్నో జాతీయ, అంతర్జాతీయ విషయాలపై చర్చించుకునే వారన్నారు. అరిగెల సాయి మాట్లాడుతూ ప్రత్యర్థులను సైతం తన వాగ్ధాటితో పరుగులు పెట్టించిన మేధావి సుధాకర్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సీపీఐ నేతలు పముజుల దశరథరామయ్య, దామా అంకయ్య, రామరాజు, మాలకొండయ్య, బలిజేపల్లి వెంకటేశ్వర్లు, నందిపోగు రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మార్జిన్ వ్యాపారులను ఆదుకోవాలి

- రోడ్డు మార్జిన్ వ్యాపారుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు విజయలక్ష్మి



మాట్లాడుతున్న రోడ్డు మార్జిన్ వ్యాపారుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు విజయలక్ష్మి

నెల్లూరు (వైద్యం) సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఎందరో నిరుద్యోగులు రోడ్డు మార్జిన్ వ్యాపారులుగా జీవనం సాగిస్తున్నారని, రోడ్డు మార్జిన్ వ్యాపారుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు విజయలక్ష్మి తెలిపారు. రోడ్డు మార్జిన్ వ్యాపారుల సంఘం సమావేశాన్ని ఆదివారం సీపీఎం జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగాలు రాక నిరుద్యోగులు మారుతున్న వీరికి అందాల్సిన సంక్షేమ పథకాలు మాత్రం అందడం లేదన్నారు. వీరికి సరైన సదుపాయాలు ఏర్పాటు చేసి బ్యాంకు రుణాలు ఇప్పించి ఆదుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. రోడ్డు మార్జిన్ వ్యాపారులపై దాడులు ఎక్కువగా జరుగుతున్నాయని, ఇలాంటి చర్యలకు పాల్పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అనంతరం 18 మందితో కమిటీ ఏర్పాటు చేశారు. సంఘం నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా వెంకటేశ్వర్లు, మోహన్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్, నాయకులు నాగేశ్వరరావు, సుధాకర్ పాల్గొన్నారు.

బీపీసీఎల్ ప్రాజెక్టుకు భూసేకరణ విరమించుకోవాలి

కావలి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కావలి తీరప్రాంతంలో ప్రజలకు ప్రధాన జీవనాధారమైన వ్యసాయం, చేపల వేటకు విఘాతం కలిగించే భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(బీపీసీఎల్)ప్రాజెక్టు కోసం అధికారులు చేపడుతున్న భూసేకరణను విరమించుకోవాలని మానవ హక్కుల వేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు మానవహక్కుల వేదిక నాయకులు వై రాజేష్, ఏ.రవి, జీ.రోహిత్, ఎండీ ఇక్బాల్‌లు ఆదివారం కావలి రూరల్ మండలం పెదపట్టపుపాలెం, చెన్నాయపాలెం, పాముగుంటపాలెం, నందిమ్మపురం గ్రామాల్లో పర్యటించారు. భూసేకరణపై ప్రజాభిప్రాయం సేకరించారు. బీపీసెల్ కంపెనీకి మా భూములు ఇస్తే తాము జీవనాధారం కోల్పోవాల్సి వస్తోందని, దాని వలన వ్యవసాయం, చేపల వేటకు విఘాతం కలుగుతోందని ప్రజలు తెలిపారన్నారు. దీంతో ప్రజల జీవనానికి ఆటంకం కలిగించే బీపీసెల్ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం చేపట్టే భూసేకరణను తక్షణమే నిలుపుదల చేయాలని వారు కోరారు.

మహిళా పోలీసు ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఓ మహిళా పోలీసు తన ఇంట్లోనే ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు, నగరంలోని కొండాయపాలెం ఎల్‌ఐసీ కాలనీ లో జయరాజు కుటుంబం నివాసం ఉంటోంది. ఆయన చిన్నకుమార్తె పద్మ ప్రియదర్శిని(29) బుజబుజనెల్లూరు దివ్యాంగు ల కాలనీ సచివాలయంలో మహిళా పోలీసుగా పనిచేస్తున్నారు. శనివారం ప్రియదర్శిని ఇంట్లో ఉండగా ఆమె తల్లి, అక్క బయటకు వెళ్లారు. వారు పనిముగించుకొని ఇంటికి తిరిగివచ్చి చూడగా ప్రియదర్శిని బెడ్ రూమ్‌లోని సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని వేలాడుతూ కనిపించింది. వెంటనే స్థానికుల సహకారంతో కిందకు దించి వనంతోపు సమీపంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు మృతురాలి అక్క సుప్రజ వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వైద్యశాలకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కి తరలించి కేసు నమోదు చేశారు. కాగా ఆమె ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

డబ్బులు ఇవ్వలేదని కత్తితో దాడి

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని స్నేహితుడిపై ఓ యువకుడు విచక్షణారహితంగా కత్తితో దాడి చేశాడు. ఈ ఘటన శనివారం అర్ధరాత్రి నిప్పో సెంటర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు, నగరంలోని నిప్పోసెంటర్ సాయిబాబా గుడి వెనుక వైపున నివాసం ఉంటున్న పీ.శివాజి, వేదాయపాలెంకు చెందిన రాములు స్నేహితులు. శనివారం రాత్రి శివాజీ నిప్పో సెంటర్‌కు వచ్చారు. సాయిబాబాగుడి వద్ద ఉండగా రాము అక్కడికి చేరుకుని తాగేందుకు డబ్బులు ఇవ్వాలని కోరాడు. తన వద్ద లేవని చెబుతున్నా వినకుండా శివాజీపై రాయితో దాడి చేశాడు. అంతటితో ఆగకుండా తన వద్దనున్న కత్తితో శివాజీ ఛాతి కిందభాగంలో బలంగా పొడిచి పరారయ్యా డు. శివాజీ అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో స్థానికులు 108 సాయంతో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఈ మేరకు బాధితుడు వేదాయపాలెం పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

కోవూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గణేశ్ నిమజ్జనం సందర్భంగా స్థానిక సత్రం వీధిలో ఈ నెల 5న బాణసంచా పేలిన ఘటనలో గాయపడిన యువకుడు లక్ష్మణ్ చికిత్స పొం దుతూ శనివారం రాత్రి మృతి చెందారు. కోవూరు సత్రం వీధి ప్రాంతంలో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమకు నిమజ్జనం చేస్తుండగా ప్రమాదవశాత్తు బాణసంచాకు నిప్పంటుకుంది. పక్కనే ఉన్న ఓ మోటారు బైకు కూడా కాలిబూడిదైంది. నిమజ్జనం తిలకిస్తున్న రామ్‌దేవ్‌బాబా ఎలక్ట్రికల్ యజమాని లక్ష్మణ్ తీవ్రంగా గాయపడడంతో చెన్నైలోని ప్రైవేటు వైద్యశా లకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ లక్ష్మణ్ మృతి చెందాడు. ఈ ఘటనపై కోవూరు పోలీసులు గణేశ్ కమిటీ సభ్యులపై కేసు నమోదు చేశారు.

కోడి పందెం స్థావరంపై పోలీసుల దాడి

కోవూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పెన్నానది తీరాన పోతిరెడ్డిపాళెం గ్రామ పరిధిలో ఆదివారం కోడి పందెం స్థావరంపై పోలీసులు దాడి చేసి ఐదుగురు పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. 8 మోటారు బైకులు, ఓ ఆటో, మూడు కోడిపుంజులు, రూ.1500 నగదు స్వాధీనం చేసుకున్నారు. కోడి పందాలు నిర్వహిస్తున్నారన్న సమాచారం అందడంతో ఎస్‌ఐ రంగనాథ్ గౌడ్ ఆధ్వర్యంలో సిబ్బంది స్థావరంపై దాడి చేశారు. దీంతో పలువురు పందెంరాయుళ్ళు పరుగులు తీశారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్ చోరీపై కేసు నమోదు

నెల్లూరురూరల్,సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరురూరల్ పరిధిలోని నారాయణ ఆసుపత్రిలో మోటారు బైక్ చోరీ అయిన ఘటనపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు సీఐ గుంజి వేణు తెలిపారు. తిరుపతి జిల్లా గూడూరుకు చెందిన అక్బర్‌బాష ఈ నెల 11న నారాయణ ఆసుపత్రికి వచ్చి తన స్ప్లెండర్ బైక్‌ను పార్కు చేసి వెళ్లారు. పనిచూసుకుని వచ్చేసరికి బైక్ లేకపోవడంతో సమీప ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో తమకు ఫిర్యాదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

నేడు కబడ్డీ జిల్లా జట్ల ఎంపికలు

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కబడ్డీ అసోసియేషన్ ఆఫ్ నెల్లూరు జిల్లా ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జిల్లా జట్ల ఎంపిక నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు హరీష్ ఒక ప్రకటనలో తెలిపారు. బాలురకు 75 కేజీలు, బాలికలకు 65 కేజీల విభాగంలో జరిగే ఈ ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు 1-1-2006 తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. ఎంపికైన వారు విజయవాడలోని గొల్లపూడిలో ఈనెల 22 నుంచి జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఆసక్తి కలిగిన వారు సోమవారం సాయంత్రం 3 గంటలకు హాజరు కావాలని తెలిపారు.

రాష్ట్ర ఫుట్‌బాల్‌కు జిల్లా జట్ల ఎంపిక

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా అన్నీ కళాశాలల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. ప్రతిభ చూపిన వారితో రాష్ట్ర పోటీలకు జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి పాటూరు వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఎంపికైన జట్లు కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో ఈనెల 24 నుంచి జరిగే రాష్ట్ర పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తాయని తెలిపారు. ఈ ఎంపికలను పీడీ, పీఈటీ, కోచ్‌లు సురేష్, సుబ్బారెడ్డి, సాయి, రేష్మ పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతున్న వృద్ధుడిని బస్సు ఢీకొనడంతో మృతిచెందాడు. నగరంలోని పొగతోటకు చెందిన తిరుపాలు(78) శనివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వచ్చాడు. మెయిన్‌రోడ్డు దాటుతుండగా యల్లాయపాలెం వెళుతున్న ప్రైవేటు బస్సు ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, కుటుంబ సభ్యులు కలిసి 108 అంబులెన్స్‌లో నారాయణ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. తిరుపాలు కుమారుడు వెంకటరత్నం ఆదివారం సౌత్‌ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ కే వెంకటరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్య

కోవూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక చేపల మార్కెట్ సమీపంలో నివసించే అలీమ్ (45) శనివారం రాత్రి మద్యం మత్తులో ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన నిత్యం మద్యం సేవించి ఇంటికి వచ్చి తననూ, ఇద్దరు కుమారులను వేధించేవాడని ఆయన భార్య అస్మత్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. గతంలో మూడు పర్యాయాలు ఆత్మహత్యకు పాల్పడగా రక్షించుకున్నామన్నారు. మానసిక, శారీరక అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రంగనాథ్ గౌడ్ తెలిపారు.

హైలెవల్ కెనాల్ తెచ్చింది ఎవరు?

- అర్థరహిత ఆరోపణలు మానుకోవాలి ● పరోక్షంగా మేకపాటిపై మంత్రి ఆనం ఆగ్రహం



అనంతసాగరం సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): 'ఆనం సంజీవ్‌రెడ్డి హైలెవల్ కెనాల్ తెచ్చింది ఎవరు? అందుకు మూలకారకులు ఎవరు? పనులు ప్రారభించింది ఎవరు? ఈవిషయాలన్నీ ప్రజలకు తెలుసు. అయితే హైలెవల్ తెచ్చింది మేము అంటూ మాట్లాడేస్తే ఎలా!?' అంటూ మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, ఆ కుంటుంబంపై రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మండిపడ్డారు. ఆదివారం సోమశిల జలాశయం నీటి విడదల చేసిన అనంతరం విలేకరులతో ఆనం మాట్లాడుతూ ఆత్మకూరుకు మేకపాటి కుటుంబం చేసింది శూన్యం అంటూ పరోక్షంగా విమర్శంచారు. మున్సిపాలిటీ నిధులతో విగ్రహాలు పెట్టుకొన్నారని, కేరళలో రోడ్డు వేయకుండా టోల్ ప్లాజా పెట్టి డబ్బు దండుకొన్న విషయం అందరికీ తెలుసన్నారు. ఈ విషయంలో మాజీ ఎమ్మెల్యేపై ఎఫ్ఐఆర్ నమోదు కాలేదా అని ప్రశ్నించారు. తనమీద, టీడీ పీ మీద, సీఎంపై అర్థరహిత ఆరోపణలు మానుకోకపోతే ఆత్మకూరు ప్రజలు ఊరుకోరన్నారు. ఈ సందర్భంగా తన హయాంలో జరిగిన అభివృద్ధి పనుల గురించి చెబుతూనే చిల్లులు పడ్డ తెర ఏర్పాటు చేసి 1.5 కోట్లు విలువకాని ఆత్మకూరు బస్టాండ్ నిర్మాణానికి రూ.7 కోట్లు అయినట్లు ప్రకటించుకొన్నారని, నవోదయ పాఠశాలకు స్థలం ఇచ్చి ఆ తర్వా త పరిహారం పొందలేదా అని ప్రశ్నించారు. తాను ఎక్కడైనా ఒక్క ఎకరా స్థలం తీసుకొన్నట్లు రుజువు చేస్తారా? అంటూ సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో అనంతసాగరం, ఆత్మకూరు ఏఎస్‌పేట, మర్రిపాడు మండలాల నాయకులు పాల్గొన్నారు.

తెలుగోళ్ల ఆశా కిరణం మంత్రి లోకేష్!

- నేపాల్ బాధితులను సురక్షితంగా రాష్ట్రానికి చేర్చారు ● నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి



మాట్లాడుతున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : తెలుగోళ్ల ఆశా కిరణం రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ అని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి వెల్లడించారు. ఆదివారం నెల్లూరులోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నేపాల్‌లో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో అక్కడున్న తెలుగు వారిని సురక్షితంగా తీసుకు వచ్చిన ఘనత లోకేష్‌దేనని అన్నారు. ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రుల కంటే వేగంగా స్పందించి బాధితులను రాష్ట్రానికి తీసుకు వచ్చేందుకు ప్రత్యేక చొరవ చూపారంటూ కొనియాడారు. నెల్లూరుకు చెందిన నవీన్, నితీష్‌తోపాటు మరో ఎనిమిది మంది నేపాల్‌లో ఉండే ఆలయానికి వెళ్లారని తెలిపారు. అయితే అక్కడ ఓ హోటల్‌లో ఉండగా అల్లర్లు మొదలయ్యాయని, ఆందోళనకారులు ఆ హోటల్‌కు కూడా నిప్పుపెట్టారని చెప్పారు. బాధితులు నాకు ఫోన్ చేయడంతో పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకు వెళ్లామని పేర్కొన్నారు. దీంతో బాధితులను మంత్రి నారా లోకేష్ ప్రత్యేక విమానం ద్వారా సురక్షితంగా రాష్ట్రానికి తీసుకు వచ్చారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అనంతపురంలో చేపట్టిన సూపర్‌సిక్స్ సభకు కూడా లోకేష్ వెళ్లకుండా రాత్రింబవళ్లు కష్టపడి నేపాల్‌లో ఉన్న తెలుగువారిని స్వస్థలానికి తీసుకు వచ్చారని తెలియచేశారు. దీనికి మంత్రి లోకేష్‌కు రుణపడి ఉంటామని చెప్పారు. నేపాల్ నుంచి వచ్చిన వారు కూడా విలేకరులతో మాట్లాడారు. మంత్రి నారా లోకేష్, కోటంరెడ్డి లేకపోతే తాము ప్రాణాలు కోల్పోయి ఉండే వారమంటూ బాధితులు తనతో చెప్పుకున్నారని అన్నారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	150
స్కిన్ చికెన్	264
స్కిన్‌లెస్	290

కోడిగుడ్ల ధర (100): 550

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.10496
వెండి కిలో ధర	రూ. 132300
వెండి ఒక గ్రాము	రూ.135.30

వరి పైరు నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

బిట్రగుంట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు నేలకొరిగిన వరిపంట నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఏవో శైలజ తెలిపారు. ఆదివారం ఆమె బోగోలు, చెంచులక్ష్మీపురం, తాళ్లూరు గ్రామాల్లో పర్యటించి వరిపైరును పరిశీలించారు. పంటపొలాల్లో వర్షపు నీరు గుర్తించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. నేలకొరిగిన వరిని పైకి లేపి మూడు దుబ్బులుగా కలిపి కట్టాలన్నారు. నిల్వ ఉన్న వర్షపు నీరు బయటకు వెళ్లేలా కాలువలు తీయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో పోలు, వీఏఏ హరిణి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నాం

● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

గుడ్లూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నియోజకవర్గంలో సంక్షేమాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని బసిరెడ్డిపాలెం రూ.14.67 లక్ష్యలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. గుడ్లూరు పోలీస్‌స్టేషన్ దగ్గర నుంచి విద్యుత్ కేంద్రం వరకు రోడ్డుకు ఒక పైపున రూ.25 లక్షలతో నిర్మించనున్న పెద్దసైడుకాలువ పనులకు భూమి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు విజయభాస్కర్, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు, నాయకులు చెన్నారెడ్డి మహేష్, గుడ్లూరు 1 ఎంపీటీసీ చెన్నారెడ్డి వరమ్మ, ఉన్నం వెంకటేశ్వర్లు, దామా వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లాస్థాయి టెన్నిస్ పోటీలు



బహుమతులందుకుంటున్న టెన్నిస్ విజేతలు

కావలి(టౌన్), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణ జేబీ, విట్స్ కళాశా లలలోని టెన్నిస్ క్రీడా ప్రాంగణాల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన ఉ మ్మడి నెల్లూరు జిల్లాస్థాయి పులివర్తి రాఘవనాయుడు మెమోరియ ల్ డబుల్ టెన్నిస్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. 40 ఏళ్ల లోపు విభాగంలో మణికంఠ, జగదీష్ జట్టు విన్నర్స్‌గా దొడ్ల లిఖిత్ రెడ్డి, గిరి జట్టు రన్నర్స్‌గా నిలిచారు. 40 ఏళ్ల పైబడిన విభాగంలో నెల్లూరుకు చెందిన నికేష్, నితిన్ జట్టు విన్నర్స్‌గా శ్రీనివాసులు రెడ్డి, రాంబాబు జట్టు రన్నర్స్‌గా నిలిచారు. 50 ఏళ్ల పైబడిన వెటరన్స్ విభాగంలో ప్రసాద్ రెడ్డి, వంశీ జట్టు విన్నర్స్‌గా, నెల్లూరుకు చెందిన శివకుమార్ రెడ్డి, చక్రి జట్టు రన్నర్స్‌గా నిలిచారు. ఆర్గనైజర్ పులివర్తి భాస్కర్‌రావు అధ్యక్షతన జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విట్స్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ దొడ్ల లిఖిత్‌రెడ్డి పాల్గొని బహుమతులు అందించారు. సీనియర్ క్రీడాకారుడు అనుమాల శెట్టి రామకృష్ణ విజేతలను అభినందించారు.

యూటీఎఫ్ రణభేరిని జయప్రదం చేయండి

కందుకూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యల పరిష్కారం, బకాయిల సాధన కోసం ఉద్యోగ, ఉపాధ్యాయులను చైతన్యం చేయటమే లక్ష్యంగా యూటీఎఫ్ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన రణభేరి యాత్ర ఈనెల 18న కందుకూరు చేరుకుంటుందని యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు కిలారి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి పొన్నగంటి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యాత్రను ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని తెలిపారు.

ప్రమాదకరంగా ఆర్వోబీ!

● ట్రాక్టర్ ఢీకొని దెబ్బతిన్న రైలింగ్ గోడ ● పట్టించుకోని అధికారులు



ట్రాక్టర్ ఢీకొని ధ్వంసమైన వంతెన రైలింగ్ గోడ

కావలి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ నడిబొడ్డున ఉదయగిరి మార్గంలో నిర్మించి ఉన్న రైల్వే ఓవర్‌బ్రిడ్జి వంతెన రైలింగ్ గోడ ధ్వంసమై ప్రమాదకరంగా మారింది. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని ప్రయాణికులు, వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల దసరా ఉత్సవాలు సందర్భంగా ఆర్వోబీ వంతెనపై వినాయక విగ్రహాన్ని సముద్రంలో నిమజ్జనం చేయటానికి తీసుకెళుతున్న జలదంకి మండలంకు చెందిన ఒక ట్రాక్టర్ అదుపు తప్పి రైలింగ్ గోడను ఢీకొంది. అయితే ట్రాక్టర్ డ్రైవర్ అప్రమత్తం కావటంతో పెను ప్రమాదం తప్పింది. ట్రాక్టర్ ఇక ఒక ఇంచె ముందుకు కదిలి ఉన్నా ట్రాక్టర్‌లో ఉన్న ప్రజలతో పాటు వంతెన కింద అప్రోచ్ రోడ్డులో వెళ్లుతున్న ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో ప్రాణాలుకోల్పోయేంత ప్రమాదం జరిగేది. వంతెనపై ఉన్న ఫుట్‌పాత్ గోడ ఎత్తు తక్కువగా ఉండడంతో ట్రాక్టర్ ఫుట్‌పాత్ ఎక్కి దాని రైలింగ్ గోడను ఢీకొంది. ఈ సంఘటన జరిగి పక్షం రోజులు దాటినా అక్కడ ప్రమాదాలు జరుగకుండా జాతీయ రహదారి అధికారులు కానీ, స్థానిక అధికారులు కానీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వంతెనపై నడిచి వెళ్లే పాదాచారులు ఆదమరిస్తే వంతెన రైలింగ్ గోడలేని ప్రాంతంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. దీనికి తోడు వంతెన రోడ్డు స్పాన్ల మధ్య దెబ్బతిన్న అధికారులు మరమ్మతులు చేస్తుండటంతో తరచూ ట్రాఫిక్ స్తంభిస్తున్నందున కొందరు ద్విచక్రవాహన చోదకులు ఫుట్‌పాత్‌పై రాకపోకలు సాగిస్తుండటంతో పడిపోయిన రైలింగ్ గోడ వద్ద ప్రమాదాలు పొంచి ఉన్నాయి. అలాగే వంతెన రైలింగ్‌ను ఢీకొట్టిన ప్రాంతంలో వాటి శిథిలాలు కిందికి వేలాడుతుండటంతో అప్రోచ్‌రోడ్డులో రాకపోకలు సాగించే వారు ఎక్కడ ఆ శిథిలాలు తమపైన పడతాయోనని భయాందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వంతెన రోడ్డుకు మరమ్మతులు చేపడుతున్న అధికారులు వెంటనే రైలింగ్ గోడ పడిపోయిన ప్రాంతంలో శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. అప్పటి వరకు అక్కడ తాత్కాలికంగా ఏదైనా నిర్మాణాలు చేపట్టి ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రమాదకరంగా వేలాడుతున్న వంతెన గోడ శిథిలాలు

న్యూస్ బాక్స్

నేటి నుంచి గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు

కందుకూరు/వలేటివారిపాలెం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): పశువులలో వచ్చే గాలికుంటు వ్యాధి నివారణకు నెలరోజులపాటు టీకాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు పశువైద్య శాఖ కందుకూరు ఏడీ డాక్టరు జే.చంద్రమోహన్, వలేటివారిపాలెం వెటర్నరీ ఏడీ ఎంతోటి చెన్నకేశవులు వేర్వేరు ప్రకటనలలో తెలిపారు. ఈ కార్యక్రమం ఆయా మండలాల్లో ఈనెల 15 నుంచి అక్టోబరు 15వరకు జరుగుతుందని తెలిపారు.

గూడ్సు రైలు గార్డుకు తీవ్రగాయాలు

బిట్రగుంట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వేస్టేషన్ ఉత్తరం వైపు ఎగువ మార్గంలో ఆదివారం గూడ్సు రైలు బోగీలు మార్చుకునే సమయంలో పనులను పర్యవేక్షిస్తున్న గూడ్సు రైలు గార్డు డీ.వెంకట్రామిరెడ్డికి ప్రమాదవశాత్తు తీవ్ర గాయాలయ్యాయి. ఆయ నను చికిత్స నిమిత్తం 108 వాహనంలో నెల్లూరుకు తరలించారు.

జాతీయ సాంకేతిక సదస్సు

కావలి(టౌన్), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విట్స్ ఇంజినీరింగ్ కళాశాల విశ్వోత్సవ్ 2025 ఆదివారం ఉత్సాహంగా జరిగింది. ప్రిన్సిపాల్ డాక్టర్ అనిల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవం సభలో విశ్వోదయ విద్యా సంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ దొడ్ల రామచంద్రారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ సాంకేతిక సదస్సు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇండోసోల్ సంస్థ మేనేజర్ ఎస్‌వీవీ సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ కళాశాలల నుంచి 1200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విట్స్ చైర్మన్ దొడ్ల విద్యాధర్‌కుమార్ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్లు లిఖిత్ రెడ్డి, ప్రత్యూషారెడ్డి, డాక్టర్ సునీల్ కు మార్, వైస్‌ప్రిన్సిపాల్ శ్రీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు ఆదివారాహి యాగం

కావలి(టౌన్), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆదివారాహి అమ్మవారి విశిష్టత చాటేందుకు దేశ వ్యాప్తంగా వారాహి మహా రథ యాత్ర నిర్వహిస్తున్నామని తిరుచానూరులోని ఆదివారాహి శక్తి టెంపుల్ ట్రస్ట్, వారాహి సేవా సైన్యం ట్రస్ట్‌ల అధ్యక్షుడు మహారుద్ర వారాహి స్వామి పేర్కొన్నారు. ఆదివారం ఎస్ఆర్ పార్కులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సోమవారం రుద్రకోట అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్న వారాహి యాగంలో భక్తులు కుటుంబ సమేతంగా పాల్గొనాలని కోరారు.

పోలీసు ఆంక్షలను ధిక్కరించి

కదిలిన కరేడు రైతులు

● హైకోర్టు ఆదేశాలు ఉల్లంఘన



కందుకూరు సీఐ, ఉలవపాడు ఎస్ఐలతో రైతుల వాగ్వాదం

కందుకూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కరేడులో బోడే రామచంద్ర యాదవ్ నిర్వహించిన సభకు రైతులు, రైతుకూలీలు పోటెత్తారు. హైకోర్టు ఆదేశాలను పట్టించుకోని కరేడు గ్రామస్థులు పోలీసు నిర్బంధాన్ని ప్రతిఘటించి తరలివచ్చారు. తమ గ్రామంలో తాము తిరిగేందుకు మీ ఆంక్షలేంటి అంటూ గ్రామస్థులు పోలీసులపై విరుచుకుపడటం, ఉప్పరపాలెంకు చెందిన ఓ రైతు నేను రాసిస్తా న న్ను కాల్చేయండి అంటూ కందుకూరు సీఐ అన్వర్‌బాషాతో వాగ్వాదానికి దిగటంతో ప్రజల్ని కంట్రోల్ చేయలేక పోలీసులు చేతులెత్తేశారు. దీంతో రామచంద్రయాదవ్‌తో గ్రామంలో ర్యాలీ జరిపారు. గ్రా మంలో రైతులతో సమావేశం నిర్వహణకు రామచంద్రయాదవ్ హైకోర్టును ఆశ్రయించగా ఈనెల 14న కరేడులో రైతులతో సమావేశం నిర్వహణకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే. అయితే 14న ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం ఒకటిన్నర వరకు మాత్రమే సమావేశం జరుపుకోవాలని సమావేశంలో 100మందికి మించి ఉండకూడదని ఆంక్షలు పెట్టింది. ఈ మేరకు గట్టి బందోబస్తు తో చర్యలు తీసుకోవాలని పోలీసుశాఖకు కూడా హైకోర్టు సూచన చేసింది. దీంతో కందుకూరు డీఎ స్పీ బాలసుబ్రహ్మణ్యం నేతృత్వంలో ఇద్దరు సీఐలు, ఆరుగురు ఎస్ఐలు, పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటుచేసినా ఫలితం లేకుండా పోయింది. మరోవైపు కరేడు పంచాయతీలోని రామకృష్ణాపురం గిరిజనకాలనీ, ఉప్పరపాలెం ప్రజలు పోలీసులను పొ లాల్లో పరుగులు పెట్టించారు. గ్రామంలోకి రాకుండా పోలీసులు అడ్డగిస్తుండటంతో పోలీసులు పొలాల్లో పరుగులు తీయకతప్పలేదు.

● పోలీసుల ముందస్తు చర్యలు సఫలం

ఉదయగిరి : వరికుంటపాడు మండలం జంగం రెడ్డిపల్లి, ఉదయగిరి మండలం అప్పసముద్రం గ్రామాల్లో ఆదివారం బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్రయాదవ్ పర్యటన శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందన్న నేపథ్యంలో పోలీసులు ముందుస్తుగా చేపట్టిన చర్యలు సఫలమయ్యాయి. కరేడు పర్యటన అనంతరం ఆయన సమస్యాత్మకంగా ఉన్న జంగంరెడ్డిపల్లి, అప్పసముద్రం గ్రామాల్లో సైతం పర్యటించి బాధితులను పరామర్శించనున్నట్లు ప్రకటించారు. అయితే ఆయా గ్రామాల్లో శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందన్న నేపథ్యంలో పోలీసు అధికారులు ముందస్తుగా సెక్షన్ 30, 144 సెక్షన్ అమలు చేయడంతోపాటు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కరేడు సభ అనంత రం ఉదయగిరి సీఐ ఎస్.వెంకటరావు తన సిబ్బందితో రామచంద్రయాదవ్‌తో చర్చించి సమస్యను వివరించారు. దీంతో స్పందించిన ఆయన తన పర్యటనను రద్దు చేసుకున్నారు.

చీకటి చట్టాలపై పోరాడకుంటే తీవ్రనష్టం

● ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి అయ్యపరెడ్డి

కందుకూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వరంగ సంస్థలలో కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెస్తున్న చీకటి చట్టాలపై కార్మికులు ఉద్యమం చేయాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అయ్యపరెడ్డి పిలుపునిచ్చారు. కందుకూరు ఆర్టీసీ డిపో ఎస్‌డబ్ల్యూఎఫ్ మూడవ మహాసభ ఆదివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో జరిగింది. ఈ మహాసభలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఈ చట్టాలపై ప్రారంభంలోనే ఉద్యమించకపోతే భవిష్యత్తులో కార్మికులు తీవ్ర సమస్యలు ఎదుర్కోక తప్పదన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా డీ.మాలకొండయ్య, కార్యదర్శిగా డీ.రమణయ్య, కోశాధికారిగా ఎస్‌కె సబ్బానీ, 11మందితో కూడిన నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా నాయకులు కట్టా సుబ్రహ్మణ్యం, ఏ.కృష్ణయ్య, ఎస్కే ఖాజావలి, డీ.మల్లికార్జునరావు, కె.నాగేంద్రరావు, సీహెచ్ వెంకటేశ్వర్లు, జీ.శీనయ్య, దేవరపల్లి రమణయ్య, సీఐటీయూ నాయకులు ఎస్‌ఏ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నిర్మూలన



కరపత్రాలు ప్రదర్శిస్తున్న జేవీవీ సభ్యులు

కావలి(టౌన్), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నివారణ సాధ్యమని జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ బెజవాడ రవికుమార్ పేర్కొన్నారు. జేవీవీ ఆధ్వర్యంలో ఆదివారం బీపీఎస్ సెంటర్‌లో వ్యాధులకు కారణమైన దోమల నివారణ చర్యలు అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు, సుబ్బరాయశర్మ, నారాయణ, ఖాదర్‌బాషా, ఎస్ వెంకయ్య, కల్లయ్య, శారద తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బాలికల వసతి గృహం ఆకస్మిక తనిఖీ

అనంతసాగరం సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేవూరు ప్రభుత్వ బాలికల వసతిగృహాన్ని డీబీసీడబ్ల్యూవో వెంకటలక్ష్మి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో ప్రత్యేకంగా మాట్లాడారు. వార్డెన్ మల్లేశ్వరి పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేసి, అభినందించారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే కష్టపడి చదివాలని విద్యార్థినులకు సూచించారు.

గురుకులంలో వైద్యశిబిరం

ఆత్మకూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని బాలికల గురుకుల పాఠశాలలో జ్వరాల బారినపడి పలువురు విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురుకులంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. స్థానిక వైద్యాధికారులు బాలికలకు వైద్యరీక్షలు నిర్వహించి తగిన చర్యలు చేపడుతున్నారు. ఆదివారం మర్రిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గోపీనాథ్ వైద్యపరీక్షలు నిర్వహించారు. అస్వస్థతకు గురై ఆత్మకూరు వైద్యశాలలో చికిత్స పొందుతున్న విద్యార్థినుల ఆరోగ్యం మెరుగుపడడంతో వారిని తిరిగి గురుకుల పాఠశాలకు చేర్చారు. జ్వరాల తీవ్రత తగ్గుముఖం పట్టిందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు తెలిపారు.

బాధితుడికి ఆర్థిక సాయం

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం ఎస్సీ కాలనీలో అనారోగ్యంతో బాధపడుతున్న బలభద్ర ఆనందరావుకు ఆదివారం ఐటీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జీ రెడ్డిబత్తిన ఉమాసాయిరాం రూ. 5వేలు ఆర్థిక సాయం అందజేశారు. తన ప్రతినిధుల ద్వారా ఆ నగదును కుటుంబ సభ్యులకు అందించి పరామర్శించారు. బాధితుడి సమస్యను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకెళ్లి మరింత ఆర్థిక సాయం అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు షేక్ ఇమ్రాన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి బీజేపీ సేవా పక్షోత్సవాలు

దుత్తలూరు(ఉదయగిరి), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ 75వ జన్మదినాన్ని పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి అక్టోబరు 2 వరకు సేవా పక్షోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ కిసాన్ మోర్చా జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు మేకపాటి మాల్యాద్రినాయుడు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రక్తదాన, వైద్య శిబిరాలు, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు, మొక్కలు నాటడం వంటివి చేపడుతామన్నారు. విజయవంతం చేయాలని కోరారు.

ఉత్తీర్ణత శాతం పెంపునకు కృషి చేయాలి : డీబీసీడబ్ల్యూవో

ఆత్మకూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ బీసీ వసతి గృహాల్లో చదివే 10వ తరగతి, ఇంటర్మీడియేట్ విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంపునకు ఇప్పటి నుంచే వసతి గృహాల సంక్షేమాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారిణి (డీబీసీడబ్ల్యూవో) పి వెంకటలక్ష్మమ్మ పేర్కొన్నారు. ఆదివారం ఆమె ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ బీసీ వసతి గృహాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించడంతో పాటు పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. క్రమం తప్పకుండా స్టడీ అవర్స్ నిర్వహించాలన్నారు. ప్రత్యేక శ్రద్ధ కనబరిస్తేనే మంచి ఫలితాలు వస్తాయన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. హెచ్‌డబ్ల్యూవోలు వసతి గృహాల్లో సమయపాలన పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏబీసీడబ్ల్యూవోవి కృష్ణయ్య, పలువురు వసతిగృహాల సంక్షేమాధికారులు పాల్గొన్నారు.



బాలికలను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న డీబీసీడబ్ల్యూవో వెంకటలక్ష్మమ్మ

స్త్రీశక్తి పథకంతో వీధినపడ్డ కార్మిక కుటుంబాలు

దుత్తలూరు(ఉదయగిరి), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన స్త్రీశక్తి పథకంతో 15 లక్షల కార్మిక కుటుంబాలు వీధినపడ్డాయని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో సీఐటీయూ మండల నాల్గవ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆటో, విద్యుత్, మినీ అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందన్నారు. ఆటో కార్మికులు బాడుగులు లేక, నెల వారి కంతులు కట్టలేక వీధినపడుతున్నారన్నారు. రవాణా రంగంలో నష్టపోయిన కార్మికులందరికీ ప్రభుత్వం ఒక్కొరికి ఏడాదికి రూ.25 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు యూరియా కొరత లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమస్యలపై ఈనెల 18న చలో విజయవాడ కార్యక్రమానికి పిలుపునిచ్చామని, ఈ సందర్భంగా మండల నూతన కమిటీని ఎంపిక చేశారు. కన్వీనర్‌గా నేలటూరి సింహాద్రి, కో-కన్వీనరర్‌గా శింగవరపు విజయరామిరెడ్డిలతోపాటు 11 మంది సభ్యులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సురేష్, హజరత్తయ్య, గుజ్జుల మల్లికార్జున, కార్మికులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

ఎమ్మెల్యే కాకర్లకు సన్మానం

వింజమూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి) : విశ్రాంత డీఎంహెచ్‌వో డాక్టర్ మాశిలామణి ఆధ్వర్యంలోని చిన్నపిల్లల ఆసుపత్రిని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదివారం సందర్శించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. పట్టణంలో కార్పొరేట్ స్థాయి వైద్య సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావడానికి జిల్లా కేంద్రం నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కిమ్స్ విభాగాన్ని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేని డాక్టర్ మాశిలామణి సన్మానించారు. ఈ కార్యక్రమంలో వింజమూరు మండల కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



17న యూటీఎఫ్ రణభేరి

వింజమూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సూపర్ సిక్స్ సూపర్ హిట్ కార్యక్రమాలు జరుపుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం ఆ పథకాలు ప్రజలకు అందడానికి వారథులైన ఉద్యోగ, ఉపాధ్యాయులను విస్మరించిందని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చలపతి శర్మ విమర్శించారు. ఆదివారం స్థానిక యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో యూటీఎఫ్ రణభేరి పోస్టరును ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ పాలనలో ఉద్యోగ ఉపాధ్యాయులు ఎంతో నష్టపోయారన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 17న వింజమూరులో చేపట్టే రణభేరి ప్రచార యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు చెంచలబాబుయాదవ్, వెంకటేశ్వరరెడ్డి, వీరాంజనేయులు, పరమేశ్వరరావు, మల్యాద్రి, మీరావలి, నాగేశ్వరరావు, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

దుర్గం అడవుల్లో నాటుసారా ఘాటు




ఉదయగిరి దుర్గం అడవిలో నాటుసారా బట్టీ

ఉదయగిరి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నాటుసారా నిర్మూలనకు అధికారులు ఎన్ని చర్యలు చేపట్టినా అవి బూడిదలో పోసిన పన్నీరులా మారుతున్నాయి. అధికారుల తూతూమంత్ర చర్యలతో సారా తయారీదారులు యథేచ్ఛగా బట్టీలు నిర్వహిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అందుకు ఉదాహరణే ఉదయగిరి పట్టణానికి సమీపంలోని హ నుమాన్‌నాలా వద్ద గల దుర్గం అడవుల్లో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు బట్టీని ఏర్పాటు చేసి యథేచ్ఛగా సారా తయారీ చేస్తుండ డాన్ని ఆదివారం అటుగా వెళుతున్న పర్యాటకులు గుర్తించారు. ఈ విషయం పట్టణంలో దావనంలా వ్యాపించింది. బట్టీ ప్రాంతంలో రెండు డ్రమ్ముల్లో ఊట, ముడి సరుకు, తయారీ సామగ్రి తదితరాలు ఉన్నాయి. గుట్టుచప్పుడు కాకుండా కొన్ని నెలలుగా ఇక్కడ సారా తయారు చేస్తున్నట్లు అనవాళ్లు కనిపిస్తున్నాయి. మద్యానికి బానిసైన కొందరు దానిని కొనుగోలు చేయలేక ఇలా నాటు సారా తయారీని ఉపాధిగా మలుచుకుని తాము సేవించడంతో పాటు ఇతరులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనా రెడ్డిని ప్రశ్నించగా సారా తయారీ విషయం తమ దృష్టికి వచ్చిందని, పరిశీలించి అందుకు కారుకులైన వారిని గుర్తించి కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు.

మోటారు బైక్ బోల్తాపడి ఇద్దరికి తీవ్రగాయాలు

కావలి రూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి, రాజువారి చింతలపాలెం మధ్యన ఆదివారం రాత్రి మోటారు బైక్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో రాజువారి చింతలపాలెంకు చెందిన కత్తి బుజ్జిబాబు, పెళ్లకూరు రవికి తీవ్రగాయాలయ్యాయి. వీరు కొత్తపల్లి నుంచి స్వగ్రామం వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. స్థానికుల సమాచారంతో క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108లో కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు.అక్కడ ప్రథమ చికిత్స అనంతరం వారి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకి తరలించారు.



నేడు జిల్లాలో పీజీఆర్ఎస్ రద్దు

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): తిరుపతి కేంద్రంగా జాతీయ మహిళా సాధికార సదస్సు జరుగుతున్న నేపథ్యంలో సోమవారం జిల్లా, మండల కేం ద్రాల్లో నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి, సహకరించాలని కోరారు.

విజయవాడకు వెళ్లిన కలెక్టర్ : అమరావతిలో సోమ, మంగళవారాల్లో కలెక్టర్ల సదస్సు జరగనుంది. ఆ సదస్సులో పాల్గొనేందుకు ఆదివారం రాత్రి కలెక్టర్ వెంకటేశ్వర్ బయలుదేరి వెళ్లారు.



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్‌సింగ్, రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, ఎంపీ పురందేశ్వరి, మంత్రి కేశవ్

మహిళా శక్తి.. దేశానికి ప్రగతి

- చారిత్రక ఘట్టానికి తిరుపతి అపూర్వ వేదిక
- నగరంలో తొలి జాతీయ మహిళా సాధికారత సదస్సు



సదస్సు ప్రాంగణం వద్ద మంత్రి, ఎంపీలు, ఎమ్మెల్యేలు

తిరుపతి, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతి.. జాతీయ మహిళా సాధికారత సదస్సుకు వేదికగా నిలిచింది. దేశనలుమూలలనుంచి మహిళా సాధికారత కమిటీ ప్రతినిధులు, పార్లమెంటు సభ్యులు వంటి ప్రముఖులు హాజరవడంతో తిరుపతి ఒక చారిత్రక ఘట్టానికి ఆతిథ్యమిచ్చింది. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నేతృత్వంలో 'వికసిత్ భారత్‌కు మహిళల నాయకత్వం' అనే నినాదంతో నిర్వహిస్తున్న రెండు రోజుల సదస్సు ఆదివారం రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌లో ప్రారంభమైంది. చట్టసభల్లో మహిళా ప్రజాప్రతినిధులకు ఎదురవుతున్న సమస్యలు, సవాళ్లు, ఇబ్బందులు.. వాటిని అధిగమించడంలో మహిళా సాధికారత పాత్రపై చర్చించారు. 'మన కుమార్తెలు చదువుకొని స్వయం ఆధారితులైతేనే భారతదేశం సమగ్ర, అభివృద్ధి చెందిన దేశంగా మారుతుంది' అని సదస్సును ప్రారంభించిన ఓం బిర్లా స్పష్టంచేశారు. గ్రామపంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు మహిళల ప్రాతినిధ్యం పెరగాలని సూచించారు. భారత రాజ్యాంగం మహిళల హక్కులకు బలమైన పునాదులు వేసిందని రాజ్యసభ ఉపాధ్యక్షుడు హరివంశ్ నారాయణ్ సింగ్ అన్నారు. మహిళా స్వశక్తీకరణపై లోతైన చర్చలకు ఈ సదస్సు ముఖ్య వేదికగా నిలిచిందన్నారు. దివంగత సీఎం ఎన్టీఆర్ మహిళలకు ఆస్తిలో సగం భాగం ఇచ్చే చట్టం చేశారని రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు గుర్తుచేశారు. ఉద్యోగాల్లో, చదువుల్లో రిజర్వేషన్లు కల్పించారని, ప్రతిభా భారతి స్పీకర్‌గా నియమించడం ఒక చారిత్రాత్మక నిర్ణయమన్నారు. రాష్ట్రస్థాయి మహిళా సాధికారత కమిటీలను పార్లమెంటరీ మహిళా సాధికారత కమిటీతో కలిపి పవిత్ర క్షేత్రమైన తిరుపతిలో ఈ సమావేశం నిర్వహించడం చారిత్రాత్మకమైన ఘట్టమని డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు పేర్కొన్నారు. మహిళలకు 33శాతం రిజర్వేషన్ ఒక మైలురాయి అని, అయితే భవిష్యత్తులో రిజర్వేషన్ల అవసరం లేకుండా మహిళలు 50శాతం కంటే ఎక్కువ ప్రాతినిధ్యం పొందే రోజు రావాలని తాను కోరుకుంటున్నానన్నారు. మహిళా నేతృత్వంలోని అభివృద్ధి భారతదేశ జాతీయ వ్యూహంలో ఒక ముఖ్యమైన అంశమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారని పార్లమెంటు మహిళా సాధికారత కమిటీ చైర్‌పర్సన్ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. విద్య, పారిశ్రామికత, ఆరోగ్యం, డిజిటల్ అక్షరాస్యత ద్వారా మహిళలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. గృహ హింస చట్టం, లైంగిక వేధింపుల నిరోధక చట్టం వంటి చట్టాలను సమర్థంగా అమలు చేయాలని కోరారు. మహిళలు, పిల్లల రక్షణ, దివ్యాంగుల సాధికారత, వయోవృద్ధుల భద్రత కోసం కలిసి పనిచేయాలని రాష్ట్ర మహిళా సాధికారత కమిటీ చైర్‌పర్సన్ గౌరు చరితారెడ్డి పిలుపునిచ్చారు. సీఎం చంద్రబాబు మహిళా సాధికారతకు పెద్ద పీట వేయడం,'డెవలప్మెంట్ నీడ్స్ ఉమెన్' నినాదంతో పరిపాలన చేస్తున్నారని ప్రశంసించారు. తల్లికి వందనం, దీపం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలతో పాటు పెన్షన్లు, ప్రసూతి సాయం, రైతు కేంద్రిత ప్రయోజనాలు మహిళలకు మేలు చేస్తోందని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ఏఐ, బయోటెక్నాలజీ, డిజిటల్ ఎకానమీలో మహిళలు వెనుకబడకూడదని తమ ప్రభుత్వం డిజిటల్ లిటరసీ, నైపుణ్యాధికార విద్య, క్వాంటం కంప్యూటింగ్ వంటి కొత్త నైపుణ్యాలలో పెట్టుబడులు పెడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల డెలిగేట్లు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు పాల్గొన్నారు. కూటమి నేతలు పాల్గొన్నారు.



పురందేశ్వరికి జ్ఞాపిక బహూకరిస్తున్న స్పీకర్, డిప్యూటీ స్పీకర్, పక్కన గౌరు చరితారెడ్డి

చంద్రగిరి కోటలో అతిథులకు విందు







చంద్రగిరి కోటలో లైటింగ్ షో, సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తున్న డెలిగేట్లు

చంద్రగిరి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో సదస్సుకు హాజరైన డెలిగేట్లకు చంద్రగిరి కోటలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదివారం రాత్రి విందు ఇచ్చారు. ఇందులో భాగంగా చంద్రగిరి కోట విశేషాలను తెలియజేసే సౌండ్ అండ్ లైట్ కార్యక్రమాన్ని సభ్యులకు ప్రదర్శించారు. ఈ సందర్భంగా కోట ఆవరణలో ప్రదర్శించిన కుంభకోయ, థింసా, గంగజాతర నృత్యం, కూచిపూడి నృత్యం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అతిథులకు ఎమ్మెల్యేలు పులివర్తి నాని, భూమా అఖిలప్రియ, బొజ్జల సుధీర్‌రెడ్డి, గురజాల జగన్మోహన్, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి, టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్, తిరుపతి కమిషనరు మౌర్య, అసిస్టెంట్ కలెక్టర్ సందీప్ రఘువంశీ, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఆర్డీవోలు రామ్మోహన్, భానుప్రకాష్‌రెడ్డి, టూరిజం టూరిజం రీజనల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, ఏపీ శాసన వ్యవస్థ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర, ఇతర అధికారులు సిబ్బంది, స్వాగతం పలికారు. ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వాతావరణం అనుకూలించక
సీఎం పర్యటన రద్దు

తిరుపతి, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఆదివారం ప్రారంభమైన మహిళా సాధికారత ప్రారంభ సమావేశానికి హాజరుకావాల్సిన సీఎం చంద్రబాబు నాయుడు పర్యటన రద్దయింది.ఆదివారం ఉదయం చిరుజల్లులతో పాటు అమరావతి-తిరుపతి మార్గంలో ఆకాశం దట్టమైన మేఘాలతో నిండిపోయింది. ఈ పరిస్థితుల్లో ప్రయాణం సురక్షితం కాదని ఏవియేషన్ అధికారులు సీఎం ప్రయాణానికి క్లియరెన్స్ ఇవ్వలేదు. దీంతో ఆయన పర్యటన చివరి నిమిషంలో రద్దయినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

నేటి ముగింపు సదస్సుకు గవర్నర్

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): సోమవారం జరిగే జాతీయ మహిళా సాధికారత సదస్సు ముగింపు కార్యక్రమానికి గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరుకానున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున డెలిగేట్లకు ఆయన మధ్యాహ్నం 12.30 గంటలకు ఆతిథ్య విందు ఇస్తారు. అనంతరం సదస్సుకు విచ్చేసిన ప్రతినిధులు ప్రత్యేక బస్సుల్లో శ్రీకాళహస్తీశ్వరస్వామి దర్శనానికి వెళ్లనున్నారు. రాత్రికి వీరంతా రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకుంటారు. 7.30 గంటలకు డిప్యూటీస్పీకర్ రఘురామకృష్ణంరాజు ఆత్మీయ విందు ఇవ్వనున్నారు. మంగళవారం ఉదయం అల్పాహారం తీసుకుని అతిథులు తిరుగు ప్రయాణం కానున్నారు. కాగా, గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆదివారం ఉదయమే తిరుపతికి చేరుకున్నారు. కాగా, ప్రతినిధులు సోమవారం ఉదయం తిరుమల చేరుకుని శ్రీవారిని దర్శించుకోనున్నారు.

నేటి కార్యక్రమం ఇలా : ఉదయం 10.50 గంటలకు శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడిచే పలువురికి సత్కారం. 11గంటలకు రాష్ట్ర మహిళా సాధికారత కమిటీ చైర్‌పర్సన్ గౌరు చరితారెడ్డి ప్రసంగం, 11.05గంటలకు పార్లమెంటు మహిళా సాధికారత చైర్‌పర్సన్ పురందేశ్వరి.. 11.10 స్పీకర్ అయ్యన్నపాత్రుడు.. 11.15 గంటలకు రాజ్యసభ్య డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్.. 11.20కి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా.. 11.30గంటలకు గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగిస్తారు. 11.40కి డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు ధన్యవాద తీర్మానం చేయనున్నారు.

కలెక్టర్‌కు ప్రశంసలు : డెలిగేట్లకు వసతి, బస ఏర్పాట్లు బాగున్నాయంటూ ముఖ్య అతిథులు, సభ్యులు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కలెక్టర్ వెంకటేశ్వర్, జిల్లా యంత్రాంగాన్ని ప్రశంసించారు.

డీఎస్సీ విజేతల జాబితా నేడు విడుదల

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థుల తుది జాబితాను సోమవారం పాఠశాల విద్యాశాఖ ప్రకటించనుంది. అభ్యర్థుల పూర్తి వివరాలు కలెక్టర్, డీఈవో వెబ్‌సైట్లకు పంపనుంది.ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మొత్తం 1478 నోటిఫైడ్ పోస్టులు భర్తీ చేయనుండగా వీటిలో ప్రభుత్వ, స్థానిక యాజమాన్యంలోనివి 1317 పోస్టులు కాగా, మున్సిపల్‌లో 64, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 97 పోస్టులు భర్తీ చేయనున్నారు.26,501 మంది అభ్యర్థుల నుంచి 45,221 దరఖాస్తులు రాగా వడపోతల తరువాత చివరికి 19,550 మంది పరీక్షలు రాశారు.అభ్యర్థుల టెట్ స్కోర్ (20శాతం), డీఎస్సీ స్కోర్ (80శాతం)లకు వెయిటేజ్‌తో మెరిట్ జాబితాలు రూపొందించారు. ఏడు రౌండ్లలో అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన జరిగింది.ఎంపిక పరిధిలోకి వచ్చిన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలు మరోమారు విజయవాడ కేంద్రంగా జిల్లా విద్యాశాఖ అధికారులతో పరిశీలింపజేశారు. యాజమాన్యాల వారీగా, పోస్టుల వారీగా డీఎస్సీ విజేతల తుది ఎంపిక జాబితాను సోమవారం విడుదల చేయనున్నారు.

ఐఎంఎస్‌కు తొలి అడుగు పడింది

- త్రీడీ నమూనాను పరిశీలించిన సీఎం

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న ఇంట్రా మోడల్ బస్టాండు నిర్మాణానికి తొలి అడుగుపడింది. ఆదివారం సీఎం చంద్రబాబు క్యాంపు కార్యాలయంలో నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్మెంట్ లిమిటెడ్, ఏపీఎస్ ఆర్టీసీ ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఎన్‌హెచ్ఎల్ఎంఎల్ ప్రతినిధులు తాము రూపొందించిన త్రీడీ నమూనా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అందులో కల్పిస్తున్న సౌకర్యాల గురించి వివరించారు. పెరుగుతున్న ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని బస్ టర్మినల్ నిర్మించాలని సీఎం వారికి సూచించారు. సకల సౌకర్యాలతో ఆకట్టుకునేలా ఉండాలని, హెలిపాడ్, రోప్‌వే సౌకర్యాల సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఆదేశించారు. భవిష్యత్తులో అన్ని ఎలక్ట్రిక్ బస్సులే నడిపే అవకాశమున్నందున విరివిగా ఛార్జింగ్ సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యం

- 'డ్రగ్స్ ఫ్రీ తిరుపతి'గా మార్చడానికి కృషి
- ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన సుబ్బరాయుడు



తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గతంలో పనిచేసిన అనుభవంతో శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా పనిచేస్తానని ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు అన్నారు. తిరుపతిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం ఆయన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్నారు. రాహుల్ కన్వెన్షన్ హాలులో జరుగుతున్న జాతీయ మహిళా సాధికారత సదస్సుకు సంబంధించి భద్రతా పర్యవేక్షణలో బిజీగా గడిపారు. అనంతరం ఎస్పీ కార్యాలయానికి చేరుకున్న ఆయనకు పురోహితులు ఆశీర్వచనాలు అందచేశారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. తమ సమస్యలపై నేరుగా సంబంధిత స్టేషన్లకు వెళ్లి ఫిర్యాదు చేయాలని ప్రజలను కోరారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను పటిష్ఠంగా అమలు చేస్తానన్నారు. విజుబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యమిస్తామని చెప్పారు. దేశ, విదేశాల నుంచి తిరుమలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. మహిళలు, బాలికలపై నేరాల నియంత్రణకు కృషి చేస్తానన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. తిరుపతితో పాటు జిల్లాను డ్రగ్స్ ఫ్రీగా మార్చడానికి పటిష్ఠ ప్రణాళికలను అమలు చేస్తామని సుబ్బరాయుడు చెప్పారు. గంజాయి రవాణా, విక్రయాలు, వినియోగంపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. అనంతరం అదనపు ఎస్పీలు రవిమనోహరాచ్చారి, వెంకట్రావు, నాగభూషణరావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు ఎస్పీని కలిసి అభినందనలు తెలిపారు.

అయ్యో.. ఎంత బాధొచ్చిందో!

- పాకాలవారిపల్లె అటవీప్రాంతంలో రెండు మృతదేహాలు
- దంపతులుగా భావిస్తున్న పోలీసులు
- మరో ఇద్దరు పిల్లలను పూడ్చివేసినట్లు అనుమానం





దంపతులు ఆత్మహత్య చేసుకున్న ప్రాంతం - ఇక్కడే చిన్నారులను పూడ్చివేసినట్లు అనుమానం

చంద్రగిరి/ పాకాల, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): వాళ్లకు ఎంత బాధొచ్చిందో.. ఏమో! ఇద్దరు చెట్టుకు ఉరేసుకున్నారు. అక్కడి పరిస్థితులను బట్టి మరో ఇద్దరు పిల్లలను పూడ్చివేసినట్లు అనుమానిస్తున్నారు. వారం కిందట ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు. చంద్రగిరి మండలం పాకాలవారిపల్లెకు రెండు కిలోమీటర్ల దూరంలోని మూలకోన అటవీప్రాంతంలో ఆదివారం సాయంత్రం గొర్రెల కాపరులకు దుర్వాసన రావడంతో మృతదేహాలున్న విషయం బయటపడింది. అటవీశాఖ, పాకాల సీఐ సుదర్శన్, పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాలు గుర్తు పట్టలేని విధంగా ఉన్నాయి. సంఘటనా స్థలంలో మద్యం, కూల్‌డ్రింక్ బాటిళ్లు, మాత్రలు, సెల్ ఫోన్ చార్జర్, చిన్న పిల్లల దుస్తులున్నాయి. అక్కడే రెండు గోతులు తీసి, ఎత్తుగా మట్టి కప్పి ఉండటం, ఆగోతులపై రెండు వరుసల రాళ్లు ఉండటంతో ఇద్దరు పిల్లలను పూడ్చి వేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. వీళ్ల వెళ్లే సరికే సాయంత్రం 6 గంటలు కావడంతో మృతదేహాలను పరిశీలించి వచ్చేశారు. ఈ అటవీ ప్రాంతంపై అవగాహన ఉన్న వాళ్ళే ఆత్మహత్య చేసుకొని ఉంటారని భావిస్తున్నారు. ఆర్థిక లావాదేవీలు, లేదా ఇతర సమస్యలు కారణంగానే కుటుంబం ఆత్మహత్యకు పాల్పడి ఉందని అనుమానిస్తున్నారు. ఈ ప్రాంతం పరిధి చంద్రగిరా లేదా పాకాల మండలమా అని పోలీసులు తర్జన భర్జన పడుతున్నారు. అటవీ ప్రాంతం పరిధి మాత్రం పాకాల మండల రెవెన్యూ పరిధిలోకి వస్తుందని చంద్రగిరి పోలీసులు అంటే, పాకాలవారిపల్లె చంద్రగిరి మండలంలో ఉందని పాకాల పోలీసులు అంటున్నారు. సోమవారం ఉదయం మృతదేహాలను పరిశీలించి, గోతులు తవ్వి దర్యాప్తు చేపట్టనున్నారు.

బ్రహ్మోత్సవాలకు
కట్టుదిట్టమైన భద్రత

- ఆదేశించిన హోంమంత్రి



తిరుమల, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాలకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర హోంమంత్రి అనిత టీటీడీ విజిలెన్స్, జిల్లా పోలీసు అధికారులను ఆదేశించారు. ఆదివారం తిరుమలలోని రచన గెస్ట్‌హౌస్‌లో టీటీడీ విజిలెన్స్ సీవీఎస్వో మురళీకృష్ణ, ఏఎస్పీ రామకృష్ణ, ఇతర అధికారులతో బ్రహ్మోత్సవ భద్రతాఏర్పాట్లపై సమీక్షించారు. ఇప్పటికే చేపట్టిన ఏర్పాట్ల గురించి అధికారులు మంత్రికి వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తోపులాటలు, తొక్కిసలాటలు లేకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా బందోబస్తు,ట్రాఫిక్ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. అన్ని విభాగాలను సమన్వయం చేసుకుని విజిలెన్స్, పోలీసు విధులు నిర్వహించాలన్నారు. భక్తులతో మర్యాదపూర్వకంగా మెలిగేలా సిబ్బందికి సూచనలు చేయాలన్నారు. ప్రతి కదలికలను సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షించాలన్నారు. సమీక్షలో డీఎస్పీ విజయ్‌శేఖర్, వీఎస్వోలు రామ్‌కుమార్, సురేంద్ర, సీఐలు విజయ్‌కుమార్, శ్రీరాముడు తదితరులు పాల్గొన్నారు.

మాధవమాలలో కొయ్య బొమ్మల రా మెటీరియల్ బ్యాంకు

ఏర్పేడు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం మాధవమాలలో కొయ్య బొమ్మల కళాకారులకు కావాల్సిన రా మెటీరియల్ బ్యాంకును త్వరలో ఏర్పాటు చేస్తామని ఏపీ ఫారెస్టు డెవలప్‌మెంట్ యాక్టివిటీస్ సలహాదారు మల్లికార్జునరావు తెలిపారు. మాధవమాలలోని బాలాజీ ఉడ్ కార్వింగ్ సొసైటీని ఆదివారం ఆయన సందర్శించారు. భాకరాపేట నుంచి తిరుపతికి ప్రధాన రహదారిని అటవీప్రాంతంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్లను తొలగించే క్రమంలో.. ఆ దుంగలను మాధవమాలలో రా మెటీరియల్ బ్యాంకుగా స్టాక్ పెట్టనున్నట్లు తెలిపారు. వీటితో ఐదేళ్ల వరకు బొమ్మలు చేసుకోవడానికి సరిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌వో వివేక్, ఐఎఫ్ఎస్ సబ్ డీఎఫ్ నాగభూషణం, ఎఫ్ఆర్‌వో సుదర్శన్‌రెడ్డి, మాజీ డీఎఫ్‌వో కృష్ణయ్య రెడ్డి, శాండిల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రవికుమార్‌రాజు, బాలాజీ ఉడ్ కార్వింగ్ సొసైటీ అధ్యక్షుడు రాజాచారి, సీఈవో కృష్ణమూర్తి, రెడ్ శాండిల్ అసోసియేషన్ మెంబర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతికి సాధికారత సోపానం

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఆదివారం జాతీయ మహిళ సాధికారత సదస్సు ప్రారంభమైంది. రెండురోజుల పాటు జరిగే ఈ సదస్సుకు వివిధ రాష్ట్రాల చట్టసభల జాతీయ మహిళ సాధికారత సభ్యులు హాజరయ్యారు. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా అధ్యక్షత వహిస్తున్నారు. ఈ సందర్భంగా మహిళ సాధికారతపై సభ్యులు ఏమన్నారంటే...

మహిళా సాధికారతతోనే అభివృద్ధి



మహిళలు సర్వతోముఖాభివృద్ధి చెందినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుంది. నాడు ఎన్టీఆర్, నేడు చంద్రబాబునాయుడు మహిళా పక్షపాతులు. మహిళలకు ఆస్తిలో సగంవాటా, తిరుపతిలో పద్మావతి మహిళా యూనివర్శిటీ ఏర్పాటు లాంటి కార్యక్రమాలకు ఆనాడు దివంగత ఎన్టీఆర్ శ్రీకారం చుట్టారు. ఆయన పంథాలోనే చంద్రబాబునాయుడు పదవుల్లో, ఉద్యోగాల్లో మహిళలకు పెద్దపీట వేస్తున్నారు. ఇలాంటి సదస్సులు వల్ల మహిళలు ఎదగడానికి అవకాశం ఉంటుంది.

- వంగలపూడి అనిత, రాష్ట్ర హోంమంత్రి

వంట గది నుంచి అంతరిక్షయానానికి



మహిళలు పూర్వపు రోజుల్లో వంట గదికే పరిమితమయ్యేవారు. నేడు అంతరిక్షానికి ప్రయాణించే స్థాయికి చేరుకున్నారు. అద్భుతమైన మైళ్లురాళ్లను అధిగమిస్తున్నారు. మహిళలు మరింత ముందంజ వేయడానికి సాధికార సదస్సు ఉపయోగపడుతుంది. ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో మహిళల సాధికారత, సంక్షేమం, భద్రత కోసం ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను చేపట్టింది. 33శాతం రిజర్వేషన్లను తీసుకురానుంది.

-డీకే అరుణ, మహబూబ్‌నగర్ ఎంపీ,

ఫలప్రద చర్చలకు ఆస్కారం



మహిళలు అనేక రంగాల్లో రాణిస్తున్నారు. గ్రామీణ మహిళలు సైతం చట్టసభల్లో అడుగు పెడుతున్నారు. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా దూరదృష్టితో మహిళల అభివృద్ధి కోసం తొలిసారిగా మహిళా సాధికార సదస్సు తిరుపతిలో నిర్వహించడం గర్వించదగ్గ విషయం. సదస్సులో ఫలవంతమైన చర్చలు జరుగుతున్నాయి.

- సుధామూర్తి, రాజ్యసభ సభ్యురాలు, కర్ణాటక

మరింత సాధికారత అవసరం



స్త్రీ ఆర్థిక, రాజకీయ, సామాజిక స్వావలంబన సాధించిన దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుంది. దేశ జనాభాలో సగం ఉన్న మహిళలు మరిన్ని రంగాల్లో అవకాశాలు అందిపుచ్చుకోవాలి. మహిళ ఆర్థిక స్వావలంబన సాధించినపుడే కుటుంబం మెరుగైన స్థితికి చేరుకుంటుంది. ఇలాంటి సదస్సులు మహిళలకు ప్రయోజనకరం

- వరలక్ష్మి, చెంగల్పట్ ఎమ్మెల్యే, తమిళనాడు

విద్యతో వివక్షకు సమాధానం



ఏపీ ప్రభుత్వం జాతీయ మహిళా సాధికారత సదస్సుకు చేసిన ఏర్పాట్లు బాగున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టి అభినందనీయం. బాల్య దశ నుంచే మహిళలపై వివక్షత కొనసాగకుండా ఉండాలంటే బాలికలకు మెరుగైన విద్య, వైద్యం అందించాలి. అన్ని రాష్ట్రాల్లో మహిళ హక్కులు కాపాడాలి. ఆర్థికంగా ఎదగడానికి చేయూతనందించాలి.

- కరెమ్మ నాయక్, దేవదుర్గ ఎమ్మెల్యే, కర్ణాటక

33శాతం రిజర్వేషన్ కల్పిస్తే సత్తా చాటుతాం



రాష్ట్రంలో మహిళాభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు చేస్తున్న అభివృద్ధి అమోఘం. ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలయితే సర్పంచ్ నుంచి పార్లమెంటు వరకు సత్తా చాటుతారు. పనిచేసే చోట ఇప్పటికీ మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. అలాంటివి జరగకుండా రాష్ట్ర ప్రభుత్వాలు కఠినమైన చట్టాలు తీసుకురావాలి. రాష్ట్ర ప్రభుత్వం ఆతిథ్యం ఇస్తున్న ఈ జాతీయ సదస్సులో పాల్గొనడం సంతోషంగా ఉంది

- పరిటాల సునీత, రాప్తాడు ఎమ్మెల్యే

చంద్రబాబు స్ఫూర్తితో రాజకీయాల్లోకి...



మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, అభివృద్ధిపై చర్చకు తొలిసారి సాధికార సదస్సు తిరుపతిలో నిర్వహించడం సంతోషంగా ఉంది. మా అమ్మ శోభా నాగిరెడ్డి చంద్రబాబు స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకుని రాజకీయాల్లో వచ్చాను. మహిళలకు చట్టసభల్లో అవకాశం వస్తే సమాజం అభివృద్ధి చెందుతుందనేది చంద్రబాబు విశ్వాసం.

- భూమా అఖిలప్రియ, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



ప్రతి రాష్ట్రంలో ఇలాంటి జాతీయ సదస్సు నిర్వహించాలి. అన్ని రంగాల్లో మహిళల ప్రాతినిధ్యం వహించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా అంగన్‌వాడీలను పరిపుష్టి చేసి బాలికలకు మెరుగైన విద్యను అందించాలి. బాల్య వివాహాలను నిర్మూలించాల్సిన బాధ్యత రాజకీయ నాయకులపై ఉంది.

- ఎస్‌హెచ్ కోసరెడ్డి, కర్ణాటక మహిళ సాధికార కమిటీ చైర్మన్

సదస్సు నిర్ణయాలతో సాధికారతకు బాట



మహిళా సాధికారత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యం కృషి చేస్తున్నాయి. నాడు ఎన్టీఆర్ బాటలోనే నేడు సీఎం చంద్రబాబు మహిళాలోకం గర్వించదగ్గ స్థాయిలో పనిచేస్తున్నారు. ఐటీ రంగంలో కూడా మహిళలే ఎక్కువగా ఉద్యోగ అవకాశాలు పొందుతున్నారు. ఇందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ సదస్సు చర్చించి తీసుకునే నిర్ణయాలతో మహిళా సాధికారత అమలుకు అవకాశం కలుగుతుంది.

- పయ్యావుల కేశవ్, అసెంబ్లీ వ్యవహారాల మంత్రి

ఉచిత వైద్యశిబిరం

చిల్లకూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తీగపాళెం గ్రామంలో గల బీవీఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ కార్యాలయంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. నెల్లూరుకు చెందిన శిరిడిసాయి రూరల్ వెల్ఫేర్, మెడికల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కోటమ్మకు పూజలు

కోట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామదేవత కోటమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. అమ్మవారికి పండితులు పలు అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకరణలో ఉంచారు. కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, ఓజిలి మండలాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

నేడు గ్రీవెన్స్ డే రద్దు

గూడూరు అర్బన్, దక్కిలి, పెళ్లకూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను రద్దు చేసినట్లు గూడూరు, దక్కిలి మండలాల తహసీల్దార్లు ప్రసాద్, శ్రీనివాసులు, పెళ్లకూరు డిప్యూటీ తహసీల్దారు తెలిపారు. తిరుపతిలో జరుగుతున్న మహిళా సాధికారత జాతీయ సదస్సు నిర్వహణ విధుల్లో అధికారులు ఉన్న కారణంగా గ్రీవెన్స్ డేను రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

16, 17 తేదీల్లో స్కూల్ గేమ్స్

చిట్టమూరు, సెప్టెంబర్ 14(ఆంధ్రజ్యోతి): అరవపాళెం ఉన్నత పాఠశాలలో ఈ నెల 16, 17 తేదీల్లో స్కూల్ గేమ్స్ నిర్వహించనున్నట్లు ఎంఈవో కృష్ణయ్య తెలిపారు. అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, యోగా, చెస్ క్రీడల్లో అండర్ 14, అండర్ 17 బాల బాలికలకు పోటీలు జరుగుతాయన్నారు. ప్రతిభ చూపిన వారిని డివిజన్ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని చెప్పారు.

ముత్యాలమ్మకు పూజలు

చిల్లకూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో తూర్పు కనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి నైవేద్యం నివేదించి ప్రత్యేక అలంకారంలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.





జాతీయ రహదారి ఇరువైపులా పార్కింగ్ చేసివున్న వాహనాలు - ఆర్టీవో కార్యాలయ దారిలోనూ ఆపిన వాహనాలు

జాతీయ రహదారిపై వాహనాల పార్కింగ్

ట్రాఫిక్ సమస్యతో పాటు రాత్రిపూట ప్రమాదాలు ● పట్టించుకోని హైవే పెట్రోలింగ్ పోలీసులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో జాతీయ రహదారిపై వాహనాలను అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు, లారీలు, ఇతర వాహనాలు ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేస్తున్నారు. ముఖ్యంగా సూళ్లూరుపేట నుంచి శ్రీసిటీ, మాంబట్టు పారిశ్రామికవాడలకు వెళ్లే ట్రావెల్స్ బస్సులు, మినీ వ్యాన్‌లను హోలిక్రాస్ కూడలి నుంచి కోటపోలూరు క్రాస్ రోడ్డు వరకు హైవేకి ఇరువైపులా ఎక్కడ పడితే అక్కడ నిలుపుతున్నారు. దీనికి తోడు హోటళ్లు, దాబాల వద్ద ఉదయం, మధ్నాహ్నం, రాత్రి సమయాల్లో వాహనాలు బారులు తీరుతున్నాయి. దీంతో రహదారిపై ఇతర వాహనాలు వెళ్లడానికి ఇబ్బందికరంగా మారుతోంది. దీనివల్ల రాత్రిపూట ప్రమాదాలు జరుగుతున్నాయి. అదే విధంగా సూళ్లూరుపేట పట్టణంలో ఆర్టీవో కార్యాలయానికి వెళ్లే మార్గంలో ఫ్లైఓవర్‌ను అనుకుని రెండు వైపులా వాహనాలు అడ్డదిడ్డంగా నిలిపివేస్తున్నారు. సూళ్లూరుపేట నుంచి నెల్లూరుకు వెళ్లే జాతీయ రహదారిపై టోల్‌ప్లాజా వరకు జాతీయ రహదారికి ఇరువైపులా పట్టణంలో ఉండే ట్రావెల్స్ బస్సులు, ఇతర వాహనాలతో పాటు లారీలు బారులు తీరుతున్నాయి. శని, ఆదివారం రెండు రోజులైతే పరిశ్రమలకు సెలవు కావడంతో కంపెనీలకు వెళ్లే వాహనాలన్ని జాతీయ రహదారి పక్కనే పార్కింగ్ చేస్తున్నారు. ఈ మార్గంలోనూ హైవేను ఆనుకొని ఉన్న హోటళ్లు, దాబాలకు అల్పాహారం కోసం వెళ్లే వాహనదారులు రోడ్డుపైనే వాహనాలు ఆపుతున్నారు. దాబాలు, ట్రావెల్స్ యజమానులు ప్రైవేట్ పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసుకోవాలి. కాని ఎక్కడా ఈ నిబంధనలు అమలు చేయడం లేదు. రాత్రిపూట గస్తీలో తిరుగుతున్న హైవే పెట్రోలింగ్ పోలీసులు చూసిచూడనట్లు ఉంటున్నారు. హైవేపై వాహనాలు పార్కింగ్ చేయనీకుండా హైవే పెట్రోలింగ్ సిబ్బంది, పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

హత్య కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్



నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

గూడూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీనగర్ సమీపంలోని శ్మశానం వద్ద ఈనెల 9వ తేదీన జరిగిన రహీద్‌బాషా హత్యకేసుకు సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గాంధీనగర్ సమీపంలోని టిడ్కో గృహాల్లో నివాసముంటున్న రహీద్‌బాషా అలియాస్ మున్నా, అదే ప్రాంతానికి చెందిన వెంకటేశ్వర్లు అలియాస్ వెంకీ, ఇందిరమ్మ కాలనీకి చెందిన షఫీర్ అలియాస్ అజ్జు స్నేహితులు. ఈనెల 9వ తేదీ రాత్రి ముగ్గురూ కలిసి ఇందిరమ్మ కాలనీలో ఉన్న ఓ మద్యం దుకాణం వద్ద మందు తాగారు. అక్కడ నుంచి ఒకే మోటారు బైక్‌పై ముగ్గురూ కలిసి ఒకటో పట్టణంలోని ఓ మద్యం దుకాణంలో మద్యం కొనుగోలు చేసి టిడ్కో గృహాలకు బయలుదేరారు. ఎస్‌కేఆర్ కళాశాల దాటిన అనంతరం రహీద్‌బాషా, షఫీర్ మధ్య మాటామాటా పెరిగి స్వల్ప వివాదం చోటు చేసుకుంది. గతంలో తాను సహజీవనం చేస్తున్న ఓ మహిళ గురించి రహీద్‌బాషా అసభ్యకరంగా మాట్లాడి ఉండడంతో వెంకటేశ్వర్లు కూడా కోపం పెంచుకున్నాడు. గాంధీనగర్ క్రిస్టియన్ సమాధుల వద్ద మోటారు బైక్ ఆపి రహీద్‌బాషాపై షఫీర్, వెంకటేశ్వర్లు దాడికి పాల్పడ్డారు. వెంకటేశ్వర్లు చాకుతో రహీద్‌బాషాను పొడిచి హతమార్చాడు. సమీపంలోని సబ్‌స్టేషన్‌కు వెళ్లే రోడ్డు వద్ద బైక్ యాక్సిడెంట్‌గా చిత్రికరించేందుకు ప్రయత్నించారు. హత్యానంతరం వెంకటేశ్వర్లు, షఫీర్ టిడ్కో గృహాల్లో నివాసముంటున్న ఓ మహిళ ఇంటికి వెళ్లగా ఆమె వారికి ఆశ్రయం కల్పించింది. 10వ తేదీ ఉదయం ముగ్గురు నిందితులు కలిసి చిల్లకూరు మండలం కనుపూరు గ్రామానికి వెళ్లి అక్కడ తల దాచుకున్నారు. 10వ తేదీ ఉదయం గాంధీనగర్ సమీపంలోని శ్మశానం వద్ద రక్తపు మడుగులో పడివున్న రహీద్‌బాషా మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆదివారం వరగలి క్రాస్‌రోడ్డు వద్ద వెంకటేశ్వర్లు, షఫీర్‌లను, హత్యానంతరం నిందితులకు ఆశ్రయం కల్పించిన మహిళను అరెస్ట్ చేసినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది రామేశ్వరరావు, షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలోనే అక్రమ అరెస్ట్‌లు: టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

చిల్లకూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ పాలనోనే అక్రమ అరెస్టులు, అవినీతి జరిగాయని టీడీపీ నేతలు అన్నారు. ఆదివారం స్థానిక జ్యోతి వే బ్రిడ్జి కార్యాలయం ఆ పార్టీ మండల అధ్యక్షుడు దువ్వూరు రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేస్తున్నారని ఆ పార్టీ నేతలు అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలన్నారు. అక్రమ అరెస్టుల సంప్రదాయం వైసీపీ ప్రభుత్వానిదేనన్నారు. అధోగతి పాలైన రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబునాయుడు అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. ఆయన సారథ్యంలో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో దువ్వూరు రాజశేఖర్‌రెడ్డి, గుండాల లీలావతి, చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, నెల్లటూరు చిరంజీవి, కొండా రామచంద్రారెడ్డి, వెంకటేశ్వర్లు నాయుడు, జానకిరామిరెడ్డి, శ్రీనివాసులు, కీరవాణి, కుమార్ యాదవ్, సతీష్‌యాదవ్, శంకరయ్య, వెంకటకృష్ణయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల మారథాన్



పరుగు పందెంలో చిన్నారులు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నాయుడుపేట స్పోర్ట్స్ ఫౌండేషన్(ఎస్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో మారథాన్ నిర్వహించారు. ఆదివారం ఉదయం సంస్థ నిర్వాహకులు జ్యోతి ప్రజ్వలన చేసి మారథాన్ ప్రారంభించారు. చిన్నారుల్లో ఆరోగ్య సంరక్షణ, క్రీడా స్ఫూర్తిని పెంపొందించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. విజేతలకు ప్రసంశాపత్రాలు, బహుమతులు అందజేశారు.

నేటి నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

పెళ్లకూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయనున్నట్లు పశుసంవర్ధక శాఖ ఏడీ ధనుంజయులు తెలిపారు. ఈ నెల 15నుంచి అక్టోబరు 15వ తేదీ వరకు పశువైద్యశాఖ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి మూడు నెలలు పైబడిన పశువులకు టీకాలు వేస్తామన్నారు.

గూడలిలో ఉచిత వైద్య శిబిరం

కోట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలిలోని అభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. కోటకు చెందిన జనతా క్లినిక్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక నాయకులు ఆములూరు నాగార్జున, కె.బుల్లయ్య, రాజనాల ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు ఉమేరా, విక్రమ్‌రెడ్డి స్త్రీ సంబంధిత వ్యాధులు, రక్తహీనత, కీళ్లనొప్పులు, నడుము నొప్పులు, బీపీ, షుగర్, గ్యాస్ ట్రబుల్, ఎముకలు, నరాలకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

పోలేరమ్మ ఆలయ చైర్మన్‌కు సత్కారం

వెంకటగిరి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ ఆలయ చైర్మన్ గొల్లగుంట మురళీకృష్ణను ఆదివారం తిరుపతి జనసేన నాయకులు చెకూరు నీలాద్రి, టీడీపీ నాయకులు బెల్లంకొండ రమేష్ సన్మానించి శ్రీవారి జ్ఞాపికను అందజేశారు.

పక్షోత్సవాలను విజయవంతం చేయండి



సమావేశంలో బీజేపీ నాయకులు

తడ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 17నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు జరిగే సేవా పక్షోత్సవాలను విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు తేజారెడ్డి అన్నారు. ఆదివారం అక్కంపేట బీజేపీ కార్యాలయంలో కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి రాచర్ల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా: డ్రైవర్ మృతి

చిట్టమూరు, సెప్టెంబర్ 14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోగిలి చెరువు కట్ట సమీపంలో ఆదివారం ఉదయం ఆటో బోల్తా పడి కమతం మణి(35) మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు... కోగిలి గ్రామానికి చెందిన మణి ఆటో నడుపుతూ జీవనం సాగిస్తుంటాడు. ఆదివారం కొత్తగుంటకు వెళ్తుండగా ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మణి తీవ్రంగా గాయపడగా, అదే ఆటోలో ప్రయాణిస్తున్న మరో ఆరుగురు గాయపడ్డారు. మణిని వాకాడు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. క్షతగాత్రులకు కొత్తగుంటలో ప్రథమ చికిత్స చేయించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ చిన్న బలరామయ్య తెలిపారు.

డీఏల విడుదలకు కృషి చేయండి

సూళ్లూరుపేట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్సీ ఏర్పాటు చేయడంతో పాటు పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయించేందుకు కృషి చేయాలని ఏటీఎఫ్ ఉపాధ్యాయ సంఘ నేతలు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీకి ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు వెంటనే విడుదల చేయాలని, అలాగే నూతన పీఆర్సీ ఏర్పాటు చేసి ఐఆర్‌ను ప్రకటించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే హెల్త్‌కార్డుల పరిమితిని రూ.25 లక్షల వరకు పెంచి, సీపీఎస్‌ను రద్దు చేయాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు గోపినాథ్ రావు, జిల్లా ఉపాధ్యక్షుడు ఉస్మాన్ బాషా, స్థానిక యూనియన్ నాయకులు వెంకరత్నం, సుధాకర్ రెడ్డి, రమణయ్య, గిరి, సుజన్, సురేష్ తదితరులు ఉన్నారు.

బీజేపీ పటిష్టతకు కృషి చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ పట్టణాధ్యక్షుడు దయాకర్

గూడూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బీజేపీ పటిష్టతకు కలసికట్టుగా కృషి చేద్దామని ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు దయాకర్ అన్నారు. ఆదివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు ప్రధాని మోదీ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఈనెల 17వ తేదీన ప్రధాని జన్మదినం సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఆరికట్ల బాలకృష్ణమ నాయుడు, సురేష్ బాబు, శ్రీనివాసరావు, ధనుంజయ, బాలకృష్ణ, రవీంద్రబాబు, వెంకటేశ్వర్లు, వినీష్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి వాకర్ అందజేత

గూడూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీనగర్‌కు చెందిన దివ్యాంగుడు రెహమాన్‌కు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఎంఈవో రఘూఫ్ దాతృత్వంతో వాకర్, నిత్యావసరాలు అందజేశారు. ఆదివారం సీవీసీ పార్కులో జరిగిన ఈ కార్యక్రమంలో జేవీవీ పట్టణాధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, ఏసుపాక పెంచలయ్య, సురేంద్ర, చెంచునారాయణ, రామ్మోహన్, రజనీకాంత్, శర్మ, శ్రీనివాసాచారి, సుబ్రహ్మణ్యం, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి
రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి



సమావేశంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు

గూడూరు అర్బన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుంగపాళెం సమీపంలో గల కలర్‌షైన్ పరిశ్రమలో ప్రమాదవశాత్తు మృతిచెందిన కార్మికుడి కుటుంబానికి యాజమాన్యం రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పంటా శ్రీనివాసులురెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కలర్‌షైన్ పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి కారణంగా ఓ కార్మికుడు మృతి చెందడంతో పాటు పది మందికి గాయాలయ్యాయన్నారు. మృతుడి కుటుంబానికి రూ.కోటి తీవ్రగాయాలపాలైన ఇద్దరు కార్మికులకు రూ.50 లక్షలు, స్వల్పంగా గాయపడిన వారికి రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో పూల చంద్రశేఖర్, బ్రహ్మయ్య, సుబ్బరామరాజు, రాజేష్, వేమయ్య, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు న్యాయం చేయండి

గూడూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కలర్‌షైన్ పరిశ్రమలో మృతిచెందిన, గాయపడిన కార్మికులకు పరిశ్రమ యాజమాన్యం న్యాయం చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని తుంగపాళెం సమీపంలోని కలర్‌షైన్ పరిశ్రమ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశ్రమలోని జింక్‌పాట్ వద్ద సంభవించిన పేలుడు దాటికి ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఆదిత్య కుమార్ అనే వ్యక్తి మృతి చెందాడన్నారు. మరో ఇద్దరు కార్మికులు తీవ్రంగా గాయపడడంతో పాటు మరో 8మంది కార్మికులకు గాయాలయ్యాయన్నారు. మృతుగా కుటుంబానికి పరిశ్రమ యాజమాన్యం రూ.కోటి, తీవ్రంగా గాయపడిన వారికి రూ.50లక్షలు, స్వల్పంగా గాయపడిన వారికి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో వెంట్రామిరెడ్డి, బీవీరమణయ్య, జోగి శివకుమార్, మధు, రఫీ, శంకరయ్య, ప్రసాద్, చంద్రయ్య, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంకాళమ్మ ఆలయంలో హుండీ చోరీ

కోట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణ పరిధిలోని శ్యామసుందరపురంలో గల గ్రామదేవత అంకాళమ్మ ఆలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. ఆలయం గ్రామానికి దూరంగా ఉండ టంతో గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించి గర్భగుడి సమీపంలో ఉన్న హుండీని ఎత్తుకెళ్లారు. అంతేకాకుండా అమ్మవారికి ధరించి ఉన్న చిన్నచిన్న వెండి సామగ్రిని కూడా అపహరించుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. ఉదయం పూజారి పూజ నిమిత్తం ఆలయానికి రాగా, తలుపులు పగలగొట్టి ఉన్న దృశ్యాన్ని చూసి పరిశీలించగా హుండీ అపహరణకు గురైనట్లుగా గుర్తించారు. ఈ సమాచారాన్ని స్థానికులకు తెలియజేయడంతో గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.





తిరుపతిలో జరుగుతున్న జాతీయ మహిళా సాధికారత సదస్సులో శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజుతో గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి - మంత్రులు గుమ్మడి సంధ్యారాణి, సవిత, వంగలపూడి అనిత, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజుతో సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ